

TGTEL/25/A1713

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక :220 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | ఆదివారం 26 జూలై 2026 | వెల : 4/-

‘విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం’..
తీవ్రంగా బాధపడ్డా: ధర్మేంద్ర

నాలుగు దశాబ్దాలుగా విద్యా రంగంతో అనుబంధం

నైతిక బాధ్యత వహిస్తూ పదవి నుంచి తప్పుకున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి

## సీజేపీ ఉద్యమంతో

# దిగొచ్చిన కేంద్రం





## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

*నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నీట్ యూజీ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపినట్లు ఎక్స్ వేదికగా తెలిపారు. నీట్ లీకేజీపై విద్యార్థుల ఆందోళనలు, ప్రతిపక్షాల విమర్శలు కొనసాగుతున్న సమయంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర మంత్రులతో జరిగిన చర్చల్లో కాక్రోచ్ జనతాపార్టీ ప్రతినిధులు విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ప్రధాన డిమాండ్‌గా పెట్టినట్లు సమాచారం. ఆ డిమాండ్ల నేపథ్యంలోనే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. రాజీనామా అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, తనకు వ్యక్తిగత ప్రతిష్ఠ కంటే విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యమని స్పష్టం చేశారు.*

2

## ‘మేం సాధించాం ఇది విద్యార్థుల విజయం’

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సీజేపీ హర్షం

జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు

ప్రజాస్వామ్యం విజయమంటూ విపక్షాల స్పందన

2


## ప్రధాన్ రాజీనామాను స్వాగతిస్తున్నా

విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో ఇది తొలి అడుగు

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను స్వాగతించిన రాహుల్‌గాంధీ

దేశవ్యాప్తంగా విద్యార్థుల పోరాటం చూసి గర్విస్తున్నామని వెల్లడి





## ఇందిరమ్మ ఇళ్ల కోసం కాల్ సెంటర్

- ఇందిరమ్మ ఇళ్ల సందేహాల నివృత్తికి ప్రత్యేక కాల్ సెంటర్
- 040-24603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి
- దరఖాస్తుకు ఆధార్ ఒక్కటే చాలు, ఇతర పత్రాలు అవసరం లేదు
- ఇల్లు రాకపోతే రూ.10 వేల డిపాజిట్ వెనక్కి వస్తుంది
- లబ్ధిదారుడు రూ.6 లక్షలు చెల్లిస్తే చాలు, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ
- ఇల్లు రాకపోతే అదే ఖాతాకు తిరిగి చెల్లిస్తామన్న మంత్రి పొంగులేటి

హైదరాబాద్

ప్రజాప్రభుత్వంలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్స్‌పై వస్తున్న సందేహాల నివృత్తికి ప్రత్యేక కాల్ సెంటర్ హెల్ప్‌లైన్‌ను గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. హౌసింగ్ బోర్డు కార్యాలయంలో ప్రారంభించిన హెల్ప్‌లైన్ సెంటర్‌లో పథకంపై ప్రజల్లో ఎలాంటి గందరగోళం, - మిగతా3లో

## దేశ భవిష్యత్ అంతా యువతరానిదే



- జెన్ జీ పోరాటానికి ప్రధాని మోదీ తలవంచారు
- నీట్ పేపర్ లీక్, విద్యార్థులపై లాఠీచార్జికి నిరసనగా ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ నేతృత్వంలో ర్యాలీ
- కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, విద్యార్థులు


హైదరాబాద్

చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని వెల్లడించారు. నీట్ పేపర్ లీక్ ఘటనతో పాటు ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన అమానుష లాఠీచార్జిని నిరసిస్తూ, విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేశ్? కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, - మిగతా3లో



## విద్యార్థుల అన్ని డిమాండ్లకు కేంద్రం ఓకే

- ఆందోళనను విరమించిన సీజేపీ
- విద్యార్థులపై క్రమంగా కేసులు ఎత్తివేస్తామన్న ప్రభుత్వం
- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ
- చర్చలు సఫలంతో ఆందోళన విరమించాలని సీజేపీ నిర్ణయం



## వ్యవస్థీకృత నేరాలపై ఉక్కుపాదం!

- ప్రజా పరీక్షల బిల్లుకు మరింత పదును
- ఇకపై పేపర్ లీకైతే 10 ఏళ్ల జైలు, రూ.50 లక్షల జరిమానా!
- ప్రశ్నా పత్రాల లీక్, పరీక్షల్లో అక్రమ పద్ధతులు, మోసాలకు పాల్పడిన వారికి ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా 10 ఏళ్ల జైలుశిక్ష
- సర్వీస్ ప్రొవైడర్లపై జరిమానాను రూ. కోటి నుంచి రూ.5 కోట్లకు పెంపు

## ఆన్‌లైన్ గేమ్‌లు ఆడేవారి బ్యాంకు అకౌంట్స్ క్లోజ్!

- సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులే కారణం
- మ్యూల్ ఖాతాల స్థానే సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు
- గేమింగ్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్న నేరగాళ్లు
- లేదంటే అలాంటి కంపెనీల స్థాపన – దోచుకున్న డబ్బు లాభాల పేరుతో మళ్లింపు



# సీజేపీ ఉద్యమంతో దిగొచ్చిన కేంద్రం

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నీట్ యూజీ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపినట్లు ఎక్స్ వేదికగా తెలిపారు. నీట్ లీకేజీపై విద్యార్థుల ఆందోళనలు, ప్రతిపక్షాల విమర్శలు కొనసాగుతున్న సమయంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర మంత్రులతో జరిగిన చర్చల్లో కాక్రోచ్ జనతాపార్టీ ప్రతినిధులు విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ప్రధాన డిమాండ్‌గా పెట్టినట్లు సమాచారం. ఆ డిమాండ్ల నేపథ్యంలోనే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. రాజీనామా అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, తనకు వ్యక్తిగత ప్రతిష్ఠ కంటే విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యమని స్పష్టం చేశారు. గత పది రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయని పేర్కొన్నారు. దేశ యువత గందరగోళ పరిస్థితుల్లో చిక్కుకోకుండా చూడాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ చదువుపైనే దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. నీట్ వివాదాన్ని కొన్ని శక్తులు తమ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే అవకాశం ఇవ్వకూడదని పేర్కొన్నారు. దేశ ఐక్యత, యువత భవిష్యత్తు కాపాడటం అందరి బాధ్యత అని తన రాజీనామా లేఖలో వివరించారు.



తన రాజీనామా లేఖలో ధర్మేంద్ర ప్రధాన్ విద్యా రంగంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణలతో కలిసి పనిచేస్తున్నానని తెలిపారు. బలమైన దేశానికి బలమైన విద్యా వ్యవస్థ పునాది అని తాను ఎప్పుడూ నమ్ముతానని చెప్పారు. నీట్ యూజీ పరీక్షలో అక్రమాలు బయటపడిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించిందని ప్రధాన్ తెలిపారు. దర్యాప్తును సీబీఐకి అప్పగించడం, పరీక్షను రద్దు చేయడం, తిరిగి పరీక్ష నిర్వహణకు తేదీ ప్రకటించడం వంటి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

**'లక్షలాది మంది విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యం'**

నీట్ పరీక్షకు హాజరైన లక్షలాది మంది విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. పరీక్ష వివాదం కారణంగా ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థి నష్టపోకూడదనే ఉద్దేశంతో పనిచేశానని తెలిపారు. నీట్ ఫలితాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పలువురు విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధించారని చెప్పారు. అయితే కొందరు బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు.

**పేపర్ లీక్‌లపై కఠిన చర్యలు**

దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. పేపర్ లీక్‌లను నియంత్రించేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలని కేంద్రం యోచిస్తోంది. ఇటీవల నీట్ వ్యవహారంపై దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఢిల్లీ జంతర్ మంతర్ సహా అనేక ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగాయి. విద్యార్థుల న్యాయం కోసం వివిధ సంఘాలు కూడా ఉద్యమించాయి.

**'వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్'**

నీట్ పరీక్ష నిర్వహణలో మార్పులు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించే అంశంపై చర్యలు తీసుకుంటున్నట్లు ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. పరీక్షా విధానంలో పారదర్శకత పెంచడం, అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపడుతున్నట్లు చెప్పారు. రాజీనామా లేఖలో ప్రధాని నరేంద్ర మోదీకి ధర్మేంద్ర ప్రధాన్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా పనిచేసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు చెప్పారు. దేశ సేవ తన జీవితంలో అత్యంత ముఖ్యమైన బాధ్యత అని పేర్కొన్నారు.

# ప్రధాన్ రాజీనామాను స్వాగతిస్తున్నా

కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వాగతించారు. ప్రధాన్ రాజీనామాతో దేశ విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో తొలి అడుగు పడిందని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు చేసిన పోరాటాన్ని చూసి గర్విస్తున్నామని అన్నారు. వీధుల్లోకి వచ్చి పోరాడిన యువతకు, విద్యార్థులకు ఆయన అభినందనలు తెలియజేశారు. కేంద్ర మంత్రి ప్రధాన్ రాజీనామా చేసినప్పటికీ, మరో రెండు డిమాండ్ మిగిలే ఉన్నాయని రాహుల్ అన్నారు. విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని, నిరసనకారులపై జరిగిన లాఠీఛార్జీపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు సమయం అసన్నమైందని రాహుల్‌గాంధీ అన్నారు.

"ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశ విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో కీలక ముందడుగు. ప్రజాస్వామ్యం, దేశ భవిష్యత్తు, రాజ్యాంగ పరిరక్షణ కోసం వీధుల్లోకి వచ్చి పోరాడిన ప్రతి విద్యార్థికి నా అభినందనలు. మిమ్మల్ని చూస్తుంటే నాకు ఎంతో గర్వంగా ఉంది. కేంద్రం చేతిలో దాడులు, అణచివేతకు గురవుతున్న రైతులు, కార్మికులు, పేదలు- ఇలా సమాజంలోని ప్రతి వర్గానికి ఇదొక సంకేతం. ఎదిరించి నిలబడటంలోనే ధైర్యం, విజ్ఞత ఉన్నాయి . భయపడకండి, ఈ ప్రభుత్వాన్ని సాగనంపుదాం. ఇంకా రెండు డిమాండ్లు నెరవెర్చాల్సి ఉంది. మొదటిది : విద్యార్థుల వైపు వేలు లెవనెత్తి, వారిని కొట్టిన ప్రతి ఒక్కరినీ బాధ్యులను చేయాలి. రెండోది : కనీస గౌరవంతో విద్యార్థులకు ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి."

**మోదీ ప్రభుత్వానికి మేలుకొలుపు**

ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉందని రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో నిరుద్యోగం సంక్షోభస్థాయికి చేరిందని పేర్కొన్నారు. ఒక దేశాన్ని, వ్యవస్థలను నడిపే తీరు ఇది కాదని విమర్శించారు. దేశంలో విద్యా వ్యవస్థ, మీడియా, సమాఖ్య వ్యవస్థలు గాడితప్పాయన్నారు. విద్యార్థుల ఆందోళనలు దేశంలో ఉన్న



తీవ్రమైన సంక్షోభానికి నిదర్శనమని, మోదీ ప్రభుత్వానికి ఇది ఒక మేలుకొలుపు అని పేర్కొన్నారు. ఈ సంక్షోభాలను పరిష్కరించే వరకు కాంగ్రెస్ ఆందోళన కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులపై జరిపిన అణిచివేతను సోమవారం పార్లమెంటులో ప్రశ్నిస్తామని అన్నారు. విద్యార్థులపై జరిగిన దాడులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యుడని ఆరోపించారు. అమిత్ షా వైఖరిని పార్లమెంటులో ప్రశ్నిస్తామని రాహుల్ స్పష్టం చేశారు.

**విద్యావ్యవస్థలోకి ఆర్ఎస్ఎస్**

"మన దేశ విద్యావ్యవస్థ గొప్పదని ప్రపంచమంతా పేరుంది. కానీ దీనిని క్రమంగా ప్రైవేటీకరణ చేస్తున్నారు. నిరుద్యోగం పెరగడంతో యువత ఆగ్రహంతో ఉన్నారు. అందుకే విద్యావ్యవస్థ ప్రక్షాళన జరగాలని యువత కోరుకుంటున్నారు. కానీ మన విద్యావ్యవస్థను ఆర్ఎస్ఎస్ ప్రభావితం చేస్తోంది. విద్యా వ్యవస్థలోకి ఆర్ఎస్ఎస్ దొడ్డిదారిన చొరబడి, చెరబట్టింది. అందుకే దేశ విద్యావ్యవస్థను ఆర్ఎస్ఎస్ కబంధహస్తాల నుంచి విముక్తం చేయాల్సిన అవసరం ఉంది. తాజాగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, వీరి డిమాండ్లకు కేంద్రం ఒప్పుకోవడం అనేది విద్యార్థుల సాధించిన ఘనవిజయం" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**యువత దెబ్బకు కదిలిన అధికార పీఠం!**

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికార పీఠాన్ని యువత కదిలించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. విద్యావ్యవస్థను సరిదిద్దాలని కోరుతూ వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత చివరకు విజయం సాధించారని కొనియాడారు. ఈ అవినీతి ప్రభుత్వం కారణంగా తమ బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రులకు ఇది గొప్ప ఊరట అని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ యువతరానికి క్షమాపణలు చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు.

**మా డిమాండ్లకు లిఖితపూర్వక హామీ ఇవ్వాల్సిందే!**

నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ మంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత, కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) శనివారం కీలక వ్యాఖ్యలు చేసింది. తమ మూడు డిమాండ్లను తీరుస్తామని లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే ఈ రోజు సాయంత్రం 6 గంటలకు కొవ్వొత్తుల ప్రదర్శన (క్యాండిల్ మార్చ్) నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఆ మూడు డిమాండ్లు ఏమిటంటే, 1. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం (ఇది పూర్తయ్యింది.) 2. బలవన్మరణానికి పాల్పడిన నీట్ అభ్యర్థుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం చెల్లించాలి. 3. నిరసనకారులపై నమోదైన ఎఫ్?ఐఆర్?లు తక్షణం ఉపసంహరించుకోవాలి. ఈ మూడు డిమాండ్లను తీరుస్తామని లిఖితపూర్వకంగా అంగీకరిస్తే, తాము ఇళ్లకు వెళ్లిపోతామని సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా పేర్కొన్నారు. ఇక ?కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం అనేది ఒక సాధారణ మానవుడు సాధించిన విజయంగా సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా అభివర్ణించారు. నీట్ పేపర్ లీకేజీపై విద్యార్థుల నిరసనలు తార స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. దేశ యువత అయోమయ వలయంలో చిక్కుకోకుండా ఉండేందుకు, విద్యార్థుల విస్తృత ప్రయోజనాలను కాపాడేందుకు రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కాగా, ఇది యువత సాధించిన విజయమని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు.

# వ్యవస్థీకృత నేరాలపై ఉక్కుపాదం!

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దుమారం కొనసాగుతున్న వేళ, పరీక్షల అక్రమాలకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవడం కోసం కేంద్రం సిద్ధమైంది. పబ్లిక్ ఎగ్జామ్స్ (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు-2026ను కేంద్రం రెడీ చేసింది. ఇప్పటికే కేబినెట్ ఆమోదించిన చట్ట సవరణ ముసాయిదా బిల్లును సోమవారమే పార్లమెంటు ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లు ప్రకారం, పరీక్షల్లో అక్రమ పద్ధతులను అవలంబిస్తే కనీసం 5 ఏళ్ల నుంచి గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పులు ప్రతిపాదించారు. జరిమానాను రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచేందుకు ప్రతిపాదన చేశారు. సర్వీస్ ప్రొవైడర్స్‌కి విధించే జరిమానాను రూ.1కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచుతూ నిబంధన చేర్చారు. పరీక్షల నుంచి సర్వీస్ ప్రొవైడర్స్‌ని నిషేధించే కాలాన్ని 4 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పొడిగిస్తూ ప్రతిపాదనలు చేశారు. ఒక వేళ నేరం రుజువైతే, కంపెనీ డైరెక్టర్లు లేదా ఉన్నతాధికారులకు కనీసం 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 కోట్ల వరకు జరిమానా విధించనున్నారు. వ్యవస్థీకృత పరీక్షా కుంభకోణాలకు సంబంధించి శిక్ష, జరిమానాల్లో కూడా కేంద్రం మార్పులు ప్రతిపాదించింది. కనీస శిక్షను 5 ఏళ్ల నుంచి 7 ఏళ్లకు, కనీస జరిమానాను రూ.1కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచింది. పరీక్షా కుంభకోణాలపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా టాస్క్ ఫోర్స్ మొత్తం దర్యాప్తును 2 నెలల్లోపు పూర్తి చేసేలా మార్పులు ప్రతిపాదించింది. అంతేకాదు ఇందులో నేరానికి పాల్పడిన సంస్థల ఆస్తుల జప్తు అంశాన్నీ చేర్చింది. ప్రశ్నాపత్రాలు లీక్ చేయడం, ఓఎంఆర్‌లను తారుమారు చేయడం, నకిలీ వెబ్?సైట్లు సృష్టించడం, ఫేక్ అడ్మిట్ కార్డులు జారీ చేయడం మొదలైన 15 అక్రమ కార్యకలాపాలకు తాజా బిల్లు వర్తింపజేస్తున్నట్లు సమాచారం.



**ఫాస్ట్ ట్రాక్ కోర్టులు**

రోజువారీ విచారణలు జరపడానికి ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు బిల్లులో పేర్కొంది. ఛార్జ్ షీట్ దాఖలైన 3 నెలల్లోపు విచారణ ప్రక్రియను పూర్తి చేసేలా నిబంధన పెట్టింది. ప్రతిపాదిత సవరణ చట్టం అమలులోకి రాకముందే పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులకు బదిలీ చేయాలని నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించే అధికారాన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కల్పించింది. ఫాస్ట్-ట్రాక్ కోర్టు తీర్పులపై దాఖలయ్యే అప్పీళ్లను హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తుల డివిజన్ బెంచ్ విచారించాలని ప్రతిపాదించింది. వీలైనంత వరకు 3 నెలల్లోపు అప్పీళ్లపై నిర్ణయం తీసుకునేలా నిబంధన పెట్టింది. చట్ట సవరణ బిల్లును సోమవారం పార్లమెంటు ముందుకు తీసుకువచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**ప్రస్తుతమున్న చట్టం ఏం చెబుతోంది?**

పరీక్ష పేపర్ల లీకేజీ, చీటింగ్ నేరాలకు పాల్పడిన వారికి ముదేళ్ల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు. సంఘటిత నేరానికి పాల్పడిన ముఠాలకు, సంస్థల సభ్యులకు 5ఏళ్ల నుంచి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.1 కోటి జరిమానా వేసే అవకాశం ఉంది. ఈ చట్టం యూపీఎస్?సీ, ఎస్?ఎస్?సీలతోపాటు, నీట్?-యూజీ, జేఈఈ, సీయూఈటీ పరీక్షలకు వర్తిస్తుంది.

**ఉద్యోగుల తొలగింపు**

నీట్ ఆందోళనల నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో నీట్-యూజీ (2026) ప్రశ్నపత్రం లీకేజి వివాదానికి సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)లోని 47 మంది సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగించారు. వీరిలో కొందరిపై చట్టపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషీని పంచాయతీరాజ్ శాఖకు బదిలీ చేసిన నేపథ్యంలోనే ఈ పరిణామం జరగడం గమనార్హం. దీంతోపాటు ఎన్‌టీఏ అనుసరిస్తున్న ఔట్‌సోర్సింగ్ విధానంలో మార్పులు చేసి, పేపర్ లీకేజికి వీలు లేకుండా చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

## మేం సాధించాం.. ఇది విద్యార్థుల విజయం

నీట్ పేపర్ లీక్ వ్యవహరంపై చేపట్టిన విద్యార్థుల ఆందోళనలతో దిగొచ్చిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. మరోవైపు ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) హర్షం వ్యక్తం చేసింది. ఇది విద్యార్థుల విజయమని, ప్రజాస్వామ్యం అంటే ఇదేనని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మేం దీన్ని సాధించాం. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇదే మొదటి రాజీమానా. మనం భయపడకుండా, ఈ ప్రభుత్వానికి తలొగ్గకపోతే ఎవరి చేతనైనా రాజీనామా చేయించగలమనేదానికి ఇదే నిదర్శనం. శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. ఈ విషయాన్ని మహాత్మ గాంధీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలితానిచ్చింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఇది విద్యార్థుల విజయం. ప్రజాస్వామ్యం అంటే ఇదే' అని దీప్కే అన్నారు.

**'మిగిలిన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం ఆగదు'**

అయితే తమకు రాజకీయాలు అవసరం లేదని దీప్కే అన్నారు. తమ తీసుకొచ్చిన మూడు డిమాండ్లల్లో ఒకటి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనా చేశారని, మిగిలిన రెండు నెరవేరే వరకు వేచి చూస్తామని తెలిపారు. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలని, ఆత్మహత్య చేసుకున్న వారికి పరిహారం వచ్చే వరకు ఈ ఉద్యమం ఆగదని వెల్లడించారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దామని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

**స్పందించిన సోనమ్ వాంగ్‌చుక్**

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్ స్పందిస్తూ, ఇది నేరుగా ప్రజల నుంచి ఉద్భవించిన ప్రజాస్వామ్య విజయమని అన్నారు. భయాన్ని వీడినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సీజేపీ, జెన్‌జీకి అభినందనలు తెలుపుతూ ఎక్స్?లో పోస్ట్ చేశారు. జవాబుదారీతనం నుంచి ఇప్పుడు సంస్కరణల దిశగా మారిందని అన్నారు.

**ఇది మోదీ మొండితనానికి పరాజయం : ఖర్గే**

మరోవైపు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామపై కాంగ్రెస్ కూడా స్పందించింది. ఇది ప్రజాస్వామ్య విజయమని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్స్?లో పోస్ట్ చేశారు. విద్యా వ్యవస్థను సరిదిద్దడం కోసం విద్యార్థులు ధైర్యంగా పోరాడారని అన్నారు. ఇది సత్యం సాధించిన విజయమని, ప్రధాని మోదీ మొండితన ఎదుర్కొన్న పరాజయమని అన్నారు. ఇప్పుడు యువతకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాల్సిన వంతు వచ్చిందని, వారిపై లాఠీలు, దండాలు, పెల్లెట్? గన్?లను ప్రయోగించిన వారిపై కఠని చర్యలు తీసుకోవాల్సి బాధ్యత కూడా ఆయనదే అని అన్నారు. విద్యాశాఖ మంత్రి రాజీమానాతో ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం నుంచి నిరవధికంగా తప్పించుకోలేమని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. విద్యా రంగంలో పారదర్శక సంస్కరణలు, సంస్థాగత బాధ్యత ఉండాలని పిలుపునిచ్చారు.

**ప్రజాస్వామ్యం, యువత విజయం : కేజ్రీవాల్**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ఆమ్ ఆద్మీపార్టీ స్వాగతించింది. ఇది విద్యార్థులు, యువత, ప్రజాస్వామానికి లభించిన విజయమని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ప్రభుత్వం ప్రజల వాణిని వినాలని, పేపర్ లీక్‌లను నివారించడానికి చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు ఎక్స్?లో వీడియో పోస్ట్ చేశారు. యువత ఉద్యమం కారణంగానే మంత్రి రాజీనామాను ప్రభుత్వం అంగీకరించాల్సి వచ్చిందని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ ఉద్యమం ఇప్పుడు ఉద్యోగాల కల్పనకు కూడా విస్తరిస్తుందని, ప్రతి తప్పుకు జవాబుదారీతనం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## విద్యార్థుల అన్ని డిమాండ్లకు కేంద్రం ఓకే



నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై శనివారం కేంద్రం, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మధ్య జరిగిన చర్చలు ఎట్టకేలకు సఫలమయ్యాయి. సీజేపీ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. విద్యార్థులపై పెట్టిన కేసులను క్రమంగా ఎత్తివేస్తామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రకటించారు. ఢిల్లీ, మిగతా రాష్ట్రాల్లో నమోదైన కేసులు ఎత్తివేస్తామని, భవిష్యత్తులోనూ ఎవరినీ కేసులతో వేధించబోమని స్పష్టం చేశారు. అలాగే, బాధిత కుటుంబాలకు పరిహారంపై చర్చించామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో పరీక్షల నిర్వహణ విషయంలో సీజేపీతో చర్చిస్తామని వెల్లడించారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో కేంద్రం, సీజేపీ మధ్య జరిగిన మూడో విడత చర్చల్లో కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్రసింగ్, సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా పాల్గొన్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం సమావేశ వివరాలను సంయుక్తంగా మీడియాకు వెల్లడించారు.

"నాలుగు పాయింట్ల ప్రధాన సారాంశం ఏమిటంటే నిరసనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదు. ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు. ఒకవేళ ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఉంటే వాటిని ఉపసంహరించుకోవాలి. ఈ కేసులు ఢిల్లీ పోలీసుల ద్వారా నమోదైనా లేదా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ నమోదైనా సరే ఆ ఎఫ్ఐఆర్ కాపీలను మేము వారికి అందిస్తాం. నిరసనల సమయంలో ఆందోళనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడానికి, వారిపై ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండటానికి ప్రభుత్వం అంగీకరించింది. భవిష్యత్తులో కూడా ఆందోళనల నిర్వాహకులు, నిరసనకారులపై ఈ కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి కేసులు నమోదు చేయకూడదని మేము అంగీకరించాం. వారు ప్రస్తావించిన రెండో అంశం పరిహారానికి సంబంధించినది. ఈ పరిహారం చెల్లింపుపై ప్రభుత్వం తన వైఖరిని చాలా స్పష్టంగా తెలియజేసింది. నిబంధనలు లోబడి సాధ్యమైనంత పరిహారాన్ని అందిస్తాం."

**'ఆందోళనకారులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోండి'**

మరోవైపు, చర్చలు సఫలం కావడంతో ఆందోళన విరమిస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. కేంద్రం తమ డిమాండ్లు నెరవేరుస్తామని మంగళవారం నాటికి గ్యారంటీ ఇస్తామని ప్రకటించడంతో ఆందోళనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోశ్? రంకా ప్రకటించారు. మరోవైపు, తమ ఐదు సూత్రాల డిమాండ్ల పత్రాన్ని ప్రభుత్వానికి సీజేపీ ప్రతినిధులు సమర్పించారు. నాలుగు వారాల తర్వాత తదుపరి విడత చర్చలు జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై సీజేపీ ప్రతినిధి అశుతోశ్? రాంకా మాట్లాడారు. "మేము నీట్ బాధితుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం డిమాండ్ చేశాం. అందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఇది కాకుండా విద్యా, పరీక్షా సంస్కరణల గురించి ప్రస్తావిస్తూ ఐదు సూత్రాల డిమాండ్ల పత్రాన్ని కూడా ప్రభుత్వం ముందు ఉంచాం. ఆ డిమాండ్ల పత్రం గురించి సుమారు నాలుగు వారాల్లో మేం ప్రభుత్వాన్ని మళ్లీ కలుస్తాం. డిమాండ్లకు అంగీకారం లభించింది కాబట్టి నిరసనకారులు వెంటనే తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలని మేం కోరుతున్నాం" అని అశుతోశ్? పేర్కొన్నారు.

**కేసుల ఉపసంహరణపై ప్రభుత్వ హామీ**

ఇదిలా ఉండగా, సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, "కేవలం ఢిల్లీలోనే కాకుండా, ఇతర రాష్ట్రాలన్నింటిలోనూ నిరసనకారులపై దాఖలైన అన్ని ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలన్నది మా రెండో డిమాండ్. ప్రభుత్వం ఆ డిమాండ్‌ను కూడా అంగీకరించింది. అంతేకాకుండా, ఉపసంహరణ త్వరలోనే జరుగుతుంది. దాఖలైన అన్ని ఎఫ్ఐఆర్‌ల కాపీలను పంచుకుంటామని ప్రభుత్వం మాకు హామీ ఇచ్చింది. మాకు అందిన చివరి సమాచారం ప్రకారం, ఢిల్లీలో 15 నుంచి 20 ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయి. ఏది ఏమైనా ఉపసంహరణ త్వరలోనే జరుగుతుందని ప్రభుత్వం హామీ ఇచ్చింది" అని ఆయన పేర్కొన్నారు.

**'ప్రజల హక్కుల రక్షిణ భద్రతా దళాలపై ఉంది'**

ఇదిలా ఉండగా, ఢిల్లీలో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనల గురించి తమకు తెలుసని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ప్రతినిధి స్టెఫాన్? డుజారిక్ పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలపాలనుకునే వారిని ఎటువంటి వేధింపులు, అరెస్టులు లేదా గాయాల భయం లేకుండా అనుమతించడం చాలా ముఖ్యమని ఆయన తెలిపారు. ఎక్కడైనా సరే, ప్రజల శాంతియుత నిరసన హక్కులను రక్షించాల్సిన బాధ్యత అక్కడి భద్రతా దళాలపై ఉందని పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కోసం కాల్ సెంటర్

-మొదటిపేజీ తరువాయి

అపోహలు లేకుండా దరఖాస్తు విధానం, అర్హతలు, అవసరమైన పత్రాలు, చెల్లింపులు, కేటాయింపు విధానం తదితర అంశాలపై పూర్తి సమాచారం అందిస్తారని మంత్రి తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహాలు ఉన్నా మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా 040-24603572 నంబర్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఫోన్ చేసి అధికారిక సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు.

**దరఖాస్తుదారుడి నిబంధనలు ఇవే**

దరఖాస్తు దారుల సౌకర్యార్థం తెలుగు , హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో సమాచారం తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుంచి సరైన సమాచారం అందించేందుకు ఈ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. దరఖాస్తుదారు క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివాసం ఉండాలని, దరఖాస్తుదారు లేదా కుటుంబానికి ఓఆర్ఆర్, క్యూర్ పరిధిలో సొంత ఇల్లు లేదా ప్లాట్ ఉండకూడదని, ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు, ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయింపు ఉంటుందని మంత్రి వివరించారు.

**ఆన్‌లైన్ పోర్టల్, వాట్సప్ ద్వారా దరఖాస్తు**

క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా తొలి విడతలో 16 నియోజకవర్గాలలో 7680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఏ నియోజకవర్గానికి చెందిన ప్రజలు అదే నియోజకవర్గంలో



దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. దరఖాస్తు దారులు ఎలాంటి విష ప్రచారాలను నమ్మకూడదని మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్,వాట్సప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**చెల్లింపునకు యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్**

హైదరాబాద్ క్యూర్ ఏరియా ప్రాంతంలో నివసిస్తున్న అల్పాదాయ వర్గాల కుటుంబాల కోసం ఈ పథకాన్ని రూపొందించామని తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల వరకు ఉండాలని, ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరించి అర్హత కలిగిన కుటుంబానికి ఒక ఫ్లాట్? మాత్రమే కేటాయిస్తారని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. అందిన దరఖాస్తులను డిజిటల్ విధానంలో పరిశీలించడంతో పాటు, క్షేత్రస్థాయి పరిశీలన, సమగ్ర ధృవీకరణ నిర్వహిస్తామన్నారు. నిర్మిస్తున్న ఫ్లాట్ల సంఖ్య కంటే అర్హులైన దరఖాస్తుదారుల సంఖ్య ఎక్కువగా ఉంటే, పారదర్శకమైన విధానంలో లాటరీ ద్వారా ఇళ్లను కేటాయిస్తామని తెలిపారు.

**ఇల్లు మంజూరు కాకపోతే డబ్బులు వాపసు**

దరఖాస్తు సమయంలో రూ.10 వేలు చెల్లింపునకు యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్‌ను మాత్రమే ఉపయోగించాలని, ఒక వేళ ఇల్లు మంజూరు కాకపోతే తిరిగి అదే ఖాతాకు ఆ మొత్తం వాపసు అవుతుందన్నారు. పరిశీలన, కేటాయింపు, వాపసు తదితర సమాచారం పూర్తయ్యేవరకు మీసేవ రశీదు, చెల్లింపు రశీదు, దరఖాస్తు సంఖ్య, మొబైల్ నంబర్‌లను యాక్టివ్‌గా ఉంచుకోవాలని మంత్రి సూచించారు.

రూ.5 లక్షల సబ్సిడీతో స్థలం : ఈ పథకం కింద ప్రతిపాదించిన ఫ్లాట్లు ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఒక్కో ఫ్లాట్ ఖరీదు రూ.40-60 లక్షల వరకు ఉంటుందని, ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీతో పాటు అన్ డివైడెడ్ షేర్ కింద 20-25 గజాల స్థలాన్ని కూడా లబ్దిదారుని పేరిట రిజిస్ట్రేషన్ చేపడుతుందన్నారు. లబ్దిదారుడు కేవలం రూ.6 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హౌసింగ్ బోర్డు సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ గేమ్‌లు ఆడేవారి బ్యాంకు అకౌంట్స్ క్లోజ్!

మీరు ఆన్‌లైన్లో గేమ్ ఆడుతున్నారా మీ బ్యాంకు అకౌంట్‌ఏ క్షణం అయినా నిలిచిపోయే ప్రమాదం ఉందని నిపుణలు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే సైబర్ నేరగాళ్లు దోచుకున్న నగదును తెలివిగా ఇలాంటి అకౌంట్?లోకి మళ్లిస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో ఇలా జమ అయిన నగదు సైబర్ నేరానికి సంబంధించినదని తేలుతుండటంతో ఆ అకౌంట్‌లను స్తంభింపజేస్తున్నారు. మ్యూల్ అకౌంట్‌లను కాపాడుకునేందుకు సైబర్ నేరగాళ్లు వేస్తున్న ఈ కొత్త ఎత్తుకు గేమింగ్ ఆడుతున్న వారు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ మధ్యకాలంలో ఇలాంటి వందల అకౌం ట్‌లు గుర్తించిన పోలీసులు వీటిపై చర్యలు తీసుకోవాల్సిందిగా జాతీయ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌కు రాశారు.

**సైబర్ నేరగాళ్ల కొత్త మార్గం**

తెలంగాణలో సైబర్ నేరగాళ్లు సగటున రోజుకు రూ.4 కోట్ల వరకూ కొల్లగొడుతున్న సంగతి తెలిసిందే. మాయమాటలతో బోల్తా కొట్టించి బాధితుల బ్యాంకు అకౌంట్‌లోని నగదు మాయం చేస్తుంటారు. మ్యూల్ అకౌంట్‌లను ఆ డబ్బును మళ్లిస్తుంటారు. దేశవ్యాప్తంగా రెండు సంవత్సరాల కాలంలో పోలీసులు సుమారు 25 లక్షల మ్యూల్ అకౌంట్‌లను స్తంభింపజేశారు. గత సంవత్సరం తెలంగాణలో 4,775 గుర్తించారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తెలంగాణలో 1,888 మ్యూల్ అకౌంట్?లు స్తంభింపజేశారు. భవిష్యత్తులో అసలు ఇలాంటి అకౌంట్?లే దొరికే అవకాశం లేదన్న ఉద్దేశంతో సైబర్ నేరగాళ్లు నూతన మార్గం కనిపెట్టారు.

**నేరగాళ్లు కొట్టేసిన నగదు**

పలు రాష్ట్రాలు ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించారు. కానీ ఆన్‌లైన్ గేమింగ్‌కు పూర్తిగా అడ్డుకట్ట పడలేదు. అందుకే ఇతర దేశాల్లో ఉన్న సైబర్ నేరగాళ్లు ఇలాంటి గేమింగ్



కంపెనీలను నెలకొల్పడమో, ఇప్పటికే ఉన్న వాటితో ఒప్పందం కుదుర్చుకోవడమో చేస్తున్నారు. ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న వారికి లాభం వచ్చినప్పుడు సైబర్ నేరగాళ్లు తాము దోచుకున్న నగదును వారి అకౌంట్?లో జమ చేస్తున్నారు. గేమ్ ఆడేవారికి ఇది వారు ఆట ఆడినందుకు వచ్చిన లాభంగానే కనిపిస్తుంది. అంటే గేమింగ్ సంస్థ ఇవ్వాల్సిన లాభాన్ని సైబర్ నేరగాళ్లు ఇస్తున్నారు.

గేమింగ్ సంస్థలతో వారు ఇలాంటి ఒప్పందం చేసుకుంటున్నారు. ఈ విషయం ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న వారికి తెలియదు. ఈ మధ్యకాలంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు దర్యాప్తులో భాగంగా నేరగాళ్లు కొట్టేసిన నగదు తాలూకా అకౌంట్?లను పరిశీలిస్తున్నప్పుడు ఇలాంటి వ్యవహారం బయటపడింది. సైబర్ నేరాలతో తమకు సంబంధం లేదని, ఆన్‌లైన్ ఆటలు ఆడినందుకు వచ్చిన లాభం తమ అకౌంట్?లో పడిందని వారు అంటున్నారు. దీనిపై లోతుగా దర్యాప్తు జరిపినప్పుడు అసలు విషయం బయటపడింది. తెలిసినా, తెలియక పోయినా సైబర్‌నేరం తాలూకా నగదు ఖాతాలో జమ అయిందంటే ఆ అకౌంట్‌ను స్తంభింపజేసే అధికారం పోలీసులకు ఉంటుంది.

**అకౌంట్ స్తంభించిపోయే ప్రమాదం**

: ఈ ఏడాది ఇప్పటికే ఇలాంటి అకౌంట్‌లను కొన్ని వందలు గుర్తించామని పోలీసు అధికారులు తెలిపారు. ఈ అకౌంట్‌లను స్తంభింపజేయాలని జాతీయ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌కు సిఫార్సు చేశారు. ఆన్‌లైన్ ఆటలు ఆడితే బ్యాంకు అకౌంట్ స్తంభించిపోయే ప్రమాదం ఉందని పోలీసులు వెల్లడించారు.

# అంచనాలకు ఓకే - బిల్లులు మాత్రం పనులు చూశాకే

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల్లోని 4 ప్యాకేజీలకు సవరించిన అంచనాలకు మంత్రివర్గం ఆమోదం లభించినా బిల్లులు పాస్ చేసే ముందు పనికి సంబంధించిన వివరాలను నిర్ధారించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. థర్డ్ పార్టీతో పరిశీలింపజేసి, హై పవర్ కమిటీ ఆమోదం తర్వాత గుత్తేదారుకు చెల్లించాలని ఆదేశించింది. ప్రతి పనిని గుత్తేదారు చేశారా? లేదా నిర్ధారించుకోవడం, జాప్యానికి కారణం గుత్తేదారుది కాదు అని రూఢీ చేసుకోవడం సహా పలు నిబంధనలతో తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నీటి పారుదల శాఖ కార్యదర్శికి అంతర్గత మెమో పంపారు. రెండు రోజుల క్రితం పంపిన ఈ మెమో నీటి పారుదల శాఖలో సంచలనం సృష్టించింది.

**జీవో-94లో మార్పులు చేసేందుకు కమిటీ నియామకం**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులకు సంబంధించి చెల్లించే బిల్లులపై సర్కారు మరింత పారదర్శకంగా ముందుకెళ్తోంది. కాంట్రాక్టు ఒప్పంద నిబంధనలు, టెండర్ ప్రక్రియ, పనుల్లో జాప్యం, పెరుగుతున్న వ్యయం ఇలా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని మూడు దశాబ్దాల క్రితం జారీ చేసిన జీవో-94లో మార్పులు చేసేందుకు ఇటీవలే ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం నియమించింది. తాజాగా సవరించిన అంచనాకు ఆమోదం తెలిపినా, గుత్తేదారుకు బిల్లుల చెల్లింపులో నిబంధనలు మరింత కఠినతరం చేస్తూ నిర్ణయం తీసుకొంది.

**కొన్ని కారణాల వల్ల జాప్యం**

పాలమూరు నుంచి రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని 7, 11, 15, 17వ ప్యాకేజీల సవరించిన అంచనాలకు ఈ నెల 17న జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. దీనివల్ల ఖజానాపై అదనంగా రూ.2,353.38 కోట్ల భారం పడింది. 2016లో ఈ నాలుగు ప్యాకేజీల పనులకు ఒప్పందం జరగ్గా, భూ సేకరణలో ఆలస్యం, ఎన్జీటీలో కేసులు తదితర కారణాల వల్ల తీవ్ర జాప్యం జరిగింది. పదేళ్లైనా ఇంకా పనులు పూర్తి కాలేదు. ఒప్పందం ప్రకారం జరగకపోవడంతో పెరిగిన ధరల వర్తింపు, అదనంగా పని చేయాల్సి రావడం, జీఎస్టీతో సహా పెరిగిన పన్నుల భారం వల్ల భారీగా అంచనాలు పెరిగాయి.



**నీటి పారుదల శాఖను ఆశ్చర్యపరిచిన నోట్**

రెండేళ్లుగా ఆర్థిక, నీటి పారుదల శాఖల చుట్టూ తిరిగిన తర్వాత సవరించిన అంచనాలకు మంత్రివర్గం ఆమోదం లభించింది. ఇందులో ఏదుల వద్ద ఉన్న వీరాంజనేయ రిజర్వాయర్ నుంచి వట్టెం వద్ద ఉన్న వెంకటాద్రి రిజర్వాయర్‌కు నీటిని తీసుకెళ్లే మార్గంలోని సొరంగానికి సంబంధించిన ఏడో ప్యాకేజీలో రూ.918 కోట్లు పెరిగింది. వెంకటాద్రి రిజర్వాయర్‌లో మట్టికట్ట నిర్మాణానికి సంబంధించిన 11వ ప్యాకేజీలో 682.75 కోట్లు పెరిగింది.

కురుమూర్తిరాయ రిజర్వాయర్ మట్టికట్ట నిర్మాణానికి సంబంధించిన 15వ ప్యాకేజీలో 491.85 కోట్లు, ఉదండాపూర్ రిజర్వాయర్ మట్టి కట్ట నిర్మాణానికి సంబంధించిన 17వ ప్యాకేజీలో రూ.260.78 కోట్లు పెరిగింది. ఈ పెంపునకు మంత్రివర్గ ఆమోదం లభించడంతో ఇక మిగిలింది బిల్లుల చెల్లింపే అని నీటి పారుదల శాఖ భావించింది. అయితే చెల్లింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రధాన కార్యదర్శి నుంచి వచ్చిన నోట్ నీటి పారుదల శాఖను ఆశ్చర్యపరిచింది.

**సీఎస్ ఆదేశాలతో నీటి పారుదల శాఖ మల్లగుల్లాలు**

అదనంగా చేయాల్సి వచ్చిన పని, చేసిన పనిని సంబంధిత ఇంజినీర్లు నిర్ధారించి పంపడం, రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ, హైపవర్ కమిటీ ఆమోదం లభించగానే చెల్లించే వారు. ఇప్పుడు చేసిన పనిని నిర్ధారించుకొన్న తర్వాతనే బిల్లులు చెల్లించాలని సీఎస్ స్పష్టం చేశారు. మళ్లీ పెరుగుదల లేకుండా నిర్దిష్ట కాలంలో పనిని పూర్తి చేస్తామని గుత్తేదారు నుంచి అండర్ టేకింగ్ తీసుకొని అనుబంధ ఒప్పందం చేసుకోవాలని సూచించారు. కాంట్రాక్టు నిబంధనల ప్రకారం జాప్యానికి కారణం గుత్తేదారుది కాదన్న నిర్ధారణ జరిగిన చోటే చెల్లించాలని, పన్నులు, డ్యూటీలు ఎక్కడైతే వర్తిస్తాయో అక్కడే ఇవ్వాలని పేర్కొనడంతో పాటు మళ్లీ హైపవర్ కమిటీ ఆమోదం తీసుకోవాలని సూచించారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిటీకి ఛైర్మన్‌గా ఉంటారు. తాజాగా సీఎస్ నుంచి వచ్చిన ఆదేశాలతో ఏం చేయాలన్న దానిపై నీటి పారుదల శాఖ మల్లగుల్లాలు పడుతోంది.

## దేశ భవిష్యత్ అంతా యువతరానిదే

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, జెన్ జీ పోరాటానికి ప్రధాని మోదీ తలవంచారని వ్యాఖ్యానించారు. మోదీ తలవంచి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై తాము పోరాడతామని విద్యార్థులు సందేశం ఇచ్చారని తెలిపారు. దేశ భవిష్యత్ అంతా యువతరానిదే నని, యువత బాగుంటేనే దేశం బాగుంటుందని వెల్లడించారు. కేంద్రం ఝులిపించిన లాఠీఛార్జీలు, తూటాలు యువతను భయపెట్టలేదని సీఎం వ్యాఖ్యానించారు.

**ఆ క్రెడిట్ రాజీవ్‌గాంధీకే**

ఓటుహక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించింది రాజీవ్‌గాంధీ అని సీఎం గుర్తుచేశారు. 21 ఏళ్లకే స్థానికసంస్థల పాలకులుగా మారే అవకాశం పీవీ కల్పించారని చెప్పుకొచ్చారు. కొన్ని దేశాల్లో 18, 21 ఏళ్లకే ఎంపీలు, దేశాధ్యక్షులు కావొచ్చని స్పష్టం చేశారు. ఇదే తరహాలో మనదేశంలోనూ ఎంపీ, ఎమ్మెల్యేలుగా యువతకు అవకాశం రావాలని ఆకాంక్షించారు. దేశంలోనూ చట్టసభలకు పోటీ చేసే వయసు తగ్గించాలని తెలిపారు. 21 ఏళ్లకే ఎమ్మెల్యేగా పోటీ చేసేలా అసెంబ్లీలోనూ తీర్మానం చేస్తామని సీఎం వెల్లడించారు. ఆ అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని స్పష్టం చేశారు. ఆగస్టు మొదటి వారం సమావేశంలోనే అసెంబ్లీలో తీర్మానం చేస్తాన్నారు. రాహుల్ ప్రధాని అయితే చట్టసభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందని పేర్కొన్నారు. దేశంలో 30 శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని సీఎం ఆకాంక్షించారు.

**కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాం**

ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేలా ఈ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు వేలాది మంది విద్యార్థులు ఈ ఉద్యమంలో పాల్గొని తమ ఐక్యతను చాటారని పేర్కొన్నారు.

**విద్యార్థి లోకం ఏకమైంది**

దేశంలో ఏకఛత్రాధిపత్యం పాలనకు, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యావత్ విద్యార్థి లోకం ఏకమైందని అన్నారు. నీట్ వంటి కీలక పరీక్షను కూడా పారదర్శకంగా నిర్వహించలేని దుస్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. దేశ సరిహద్దుల్లో చైనా చొరబాట్లను అడ్డుకోవడంలోనూ కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యార్థుల ఆగ్రహం, ప్రజా ఉద్యమం ముందు కేంద్ర ప్రభుత్వం తలవంచి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని యావత్ దేశం ముక్తకంఠంతో ఖండించిందన్నారు.

కొండగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వరంగల్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలతో పాటు టీపీసీసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు సంఘీభావ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. “జెన్ జీ పోరాటానికి ప్రధాని మోదీ తలవంచారు. మోదీ తలవంచి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారు. ప్రభుత్వ వైఫల్యాలపై తాము పోరాడతామని విద్యార్థులు సందేశం ఇచ్చారు. దేశ భవిష్యత్ అంతా యువతరానిదే, యువత బాగుంటేనే దేశ బాగుంటుంది. కేంద్రం ఝులిపించిన లాఠీఛార్జీలు, తూటాలు యువతను భయపెట్టలేదు”

## ఈ సర్కారు బడిలో అడ్మిషన్ ఫుల్ బోర్డు హాట్‌కేక్‌లా మారిన సీట్లు




ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన విద్య కోసం కార్పొరేట్ స్కూళ్లను ఆశ్రయిస్తారు. ఆ స్కూళ్ల గేట్లపై నో సీట్స్ అంటూ వేలాడదీసిన బోర్డులను చూసి నిరాశతో వెనుదిరుగుతారు. అలాంటి పరిస్థితి ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో కనిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల వైపు చూడని తల్లిదండ్రులు ఇప్పుడు ఆ పాఠశాలల్లో లభిస్తున్న నాణ్యమైన విద్యపట్ల ఆకర్షితులయి ‘ఘర్ వాపస్’ మాదిరిగా ప్రైవేటు పాఠశాలల నుంచి తీసుకొచ్చి ప్రభుత్వ బడుల్లోను చేర్పిస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్లల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థుల సంఖ్య పెరిగిపోవడంతో తమ పాఠశాలలో సీట్లు లేవంటూ నో బోర్డును తగిలిస్తున్నారు. ఇలాంటి పరిస్థితే తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ ఫుల్ - నో సీట్స్ అంటూ బోర్డు ఏర్పాటు చేశారు.

**ప్రభుత్వ బడుల్లో సీటు దొరకడమే కష్టం**

అభివృద్ధికి, నాణ్యమైన విద్యకు మన సర్కారు బడులు చిరునామాగా మారుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలకు పోటీగా నిలుస్తూ తల్లిదండ్రుల నమ్మకాన్ని గెలుచుకుంటున్నాయి. తాజాగా రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ప్రభుత్వ పాఠశాల అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పాఠశాల గేటుకు ఏకంగా అడ్మిషన్స్ క్లోజ్డ్ అని బోర్డు పెట్టేంతగా ప్రవేశాలు పెరిగాయి. ప్రభుత్వ బడులంటే ఒకప్పుడు విద్యార్థులు లేక వెలవెలబోయే పరిస్థితి కానీ ఇప్పుడు సీటు దొరకడమే గగనమైపోతోంది.

**184 మంది కొత్తగా ప్రవేశాలు**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ బాలుర ఉన్నత పాఠశాల సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఏకంగా 91 శాతం ఉత్తీర్ణత సాధించి ఈ పాఠశాల ఆదర్శంగా నిలిచింది. ఇక్కడి ఉపాధ్యాయుల నైపుణ్యం, నాణ్యమైన బోధన నచ్చడంతో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు క్యూ కట్టారు. గతేడాది పదో తరగతి పూర్తి చేసుకున్న వారితో కలిపి మొత్తం 82 మంది వెళ్లగా వారి స్థానంలో ఏకంగా 183 మంది కొత్తగా ప్రవేశాలు పొందడం విశేషం. ఇందులో ప్రైవేటు పాఠశాలలను వదిలి 50 మందికి పైగా విద్యార్థులు ఈ ప్రభుత్వ పాఠశాలలో చేరడం ఇక్కడి విద్య ప్రమాణాలకు నిదర్శనంగా నిలుస్తోంది. మా పాఠశాలలో గతేడాది 450 మంది విద్యార్థులు ఉండేవారు.టెన్త్? క్లాస్?లో 82 మంది పాస్ అవుట్? అవ్వగా ఈ సంవత్సరం 183 అడ్మిషన్స్? అయ్యాయి. నేటికి 511 అడ్మిషన్స్? అయ్యాయి. ప్రైవేట్? పాఠశాలల నుంచి దాదాపు 50 మంది విద్యార్థులు చేరారు. గత సంవత్సరం మన పాఠశాలలో ఓ అబ్బాయికి 600లకు 570 మార్కులతో ఐఐఐటీ రావడం జరిగింది. 500 మార్కులు సాధించిన వారిలో 10 మంది విద్యార్థులు ఉండటం మా పాఠశాలకు చాలా గర్వ కారణం. ఇదంతా మా స్కూల్? టీచర్స్ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ తీసుకోవడం వల్లే సాధ్యమైంది. విద్యార్థులు 91 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది అడ్మిషన్స్ బాగా పెరిగాయి. 511 ఆడ్మిషన్స్ రావడం వల్ల నో అడ్మిషన్స్ బోర్డు కూడా ఏర్పాటు చేశాం’

**నాణ్యమైన విద్య, క్రమశిక్షణనే లక్ష్యంగా**

తమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భారీగా పెరగడంతో ఉన్న 15 మంది ఉపాధ్యాయులు 6 నుంచి 10వ తరగతి వరకు ఎ, బి సెక్షన్లుగా విభజించి బోధన అందిస్తున్నారు. కాగా ఇక ఏ తరగతిలోనూ సీట్లు ఖాళీ లేకపోవడంతో పాఠశాల గేటు వద్ద ‘అడ్మిషన్స్ క్లోజ్డ్’ అంటూ ఫ్లెక్సీ బోర్డును ఏర్పాటు చేశామని ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి తెలిపారు. మా పాఠశాలలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఉపాధ్యాయుల కృషి, నాణ్యమైన బోధన వల్లే తల్లిదండ్రుల నుంచి ఈ స్థాయిలో ఆదరణ లభిస్తోందని వివరించారు.

# నీట్‌ను పట్టించుకోని తెలుగు ప్రాంతీయ పార్టీలు

**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ, కేంద్ర ప్రభుత్వ విద్యారంగ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు మిన్నంటుతున్నా, తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాంతీయ పార్టీలు బీఆర్ఎస్ , వైఎస్సార్‌సీపీ అనూహ్యంగా మౌనం వహించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ , వివిధ విద్యార్థి సంఘాలు రోడ్లెక్కి ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ, ఈ రెండు ప్రాంతీయ పార్టీలు మాత్రం క్రియాశీలక పోరాటాలకు దూరంగా ఉంటున్నాయి. యువత , విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత సున్నితమైన అంశంపై ఈ రెండు పార్టీల మౌనం రాజకీయంగా పలు అనుమానాలకు తావిస్తోంది.సాధారణంగా ప్రతిపక్షాలకు యువత, విద్యార్థి వర్గాల మద్దతును పొందేందుకు ఇలాంటి జాతీయ స్థాయి వివాదాలు ఒక పెద్ద ఆయుధంగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా బీజేపీ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రాంతీయ పార్టీలు ముందంజలో ఉండాలి. కానీ, తెలంగాణలో బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ రెండూ కూడా జాతీయ స్థాయిలో విపక్షాల కూటమి పిలుపునిచ్చిన నిరసనలకు భౌతికంగా, ఉధృతంగా మద్దతు తెలపకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహంతో పాటు కేంద్రం పట్ల ఉన్న భయాందోళనలే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందిగ్ధ పరిస్థితికి ప్రధాన కారణం కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నాయకత్వం పట్ల ఈ పార్టీలకున్న వినూత్నమైన అభద్రత. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ గత లోక్‌సభ ఎన్నికల తర్వాత, అసెంబ్లీ ఓటమి అనంతరం తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు బీజేపీతో అనధికారికంగా ఒక వ్యూహాత్మక శాంతి ని పాటిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్రాన్ని లేదా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను నేరుగా టార్గెట్ చేస్తే టీఎంసీ లాంటి పరిస్థితులు రావొచ్చని సందేహిస్తున్నారు. అటు ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలో ఉంది. గత ఐదేళ్ల పాలనపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం పలు విచారణలకు ఆదేశిస్తున్న తరుణంలో, కేంద్రంలోని బీజేపీ పెద్దల ఆగ్రహానికి గురైతే పార్టీ మరింత తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ భావిస్తోంది. అందువల్లనే, కేంద్ర



విద్యాశాఖ , మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే విషయంలో వైఎస్సార్‌సీపీ చాలా అప్రమత్తంగా, పరిమిత వ్యాఖ్యలకే పరిమితమవుతూ, వీధుల్లోకి వచ్చి పోరాడేందుకు వెనుకాడుతోంది. విద్యార్థుల భవిష్యత్తు ఎటుపోయినా పర్వాలేదు కానీ, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు మాత్రం కేంద్రాన్ని ప్రశ్నించరు అంటూ రేవంత్ రెడ్డి టార్గెట్ చేస్తుండటంతో, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడిపోతోంది. తమ స్వయంకృత అపరాధాల వల్ల వచ్చిన కేసుల భయంతోనే బీఆర్ఎస్ నోరు మెదపడం లేదని కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అందుకే మొక్కుబడిగా జంతర్, మంతర్ దగ్గర బీఆర్ఎస్వీతో నిరసనలు చేయిస్తామని ప్రకటించారు. సుదీర్ఘ కాలంలో ఈ తరహా మౌనం ప్రాంతీయ పార్టీలకు పెద్ద దెబ్బగా మారే అవకాశం ఉంది. రాబోయే కాలంలో నిరుద్యోగిత, విద్యార్థుల సమస్యలు, రిక్రూట్‌మెంట్లు ప్రధాన రాజకీయ అంశాలుగా మారబోతున్న తరుణంలో, యువతకు అండగా నిలవాల్సిన ప్రతిపక్షాలు వెనుకడుగు వేస్తున్నాయి. ఇది కాంగ్రెస్‌కు విద్యార్థి, యువజన ఓటు బ్యాంకును మరింత బదిలీ చేసేందుకు దోహదపడుతోంది. కేంద్రంలోని బీజేపీ అగ్రనాయకత్వం పట్ల ఉన్న భయం, రాజకీయంగా వ్యూహాత్మకంగా సైలెంట్‌గా ఉండాలనే నిర్ణయం వల్లనే బీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీలు జాతీయ స్థాయి ఆందోళనలకు దూరంగా ఉంటున్నాయి. ఈ వ్యూహం ప్రస్తుతానికి తమపై కేంద్ర సంస్థల దాడులు పడకుండా కాపాడుకోవడానికి ఉపయోగపడవచ్చు ఏమో కానీ, క్షేత్రస్థాయిలో విద్యార్థులను, యువత మద్దతు కోల్పోయే ప్రమాదాన్ని ఈ ప్రాంతీయ పార్టీలు స్వయంగా తెచ్చిపెట్టుకుంటున్నాయని ఎక్కువ మంది భావిస్తున్నారు.

# 29 నుంచి 45కు పెరగనున్న సిటీ అసెంబ్లీ సీట్లు


**హైదరాబాద్ :** తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అమల్లోకి వస్తే రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం సమూలంగా మారిపోనుంది. ప్రస్తుతం ఉన్న 119 శాసనసభ స్థానాల సంఖ్య ఏకంగా 179 వరకు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాజ్యాంగ నిబంధనలు, జనాభా లెక్కల ప్రాతిపదికన ప్రతి నియోజకవర్గానికి సగటున 1.95 లక్షల జనాభాను ప్రామాణికంగా తీసుకుంటే.. ఈ ప్రక్రియలో అత్యధికంగా లబ్ధి పొందేది, సీట్లను అదనంగా సాధించుకునేది గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఉండే మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలే కానున్నాయి. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాలు విపరీతంగా విస్తరించడం వల్ల గ్రామీణ ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి నగరానికి వలసలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్ వంటి నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య ఆరు నుంచి ఏడు లక్షలు దాటిపోయింది. మిగతా జిల్లాల్లోని ఒక సాధారణ నియోజకవర్గంలో 2 నుంచి 2.5 లక్షల ఓటర్లు ఉంటే, హైదరాబాద్ అర్బన్ కారిడార్‌లోని ఒక్కో స్థానంలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండాల్సినంత జనాభా కేంద్రీకృతమైంది. ఈ వ్యత్యాసాన్ని సరిదిద్దడమే డిలిమిటేషన్ ప్రధాన లక్ష్యం కానుంది.అంచనాల ప్రకారం.. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల ఉమ్మడి అసెంబ్లీ స్థానాల సంఖ్య ప్రస్తుతం ఉన్న 29 నుంచి ఏకంగా 45కిపైగా పెరిగే అవకాశముంది. పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, మేడ్చల్, కూకట్‌పల్లి, మహేశ్వరం వంటి అతిపెద్ద నియోజకవర్గాలను రెండు లేదా మూడు కొత్త సీట్లుగా విభజిస్తారు. దీనివల్ల కేవలం గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల అర్బన్ పరిధిలోనే దాదాపు 16 నుంచి 20 కొత్త అసెంబ్లీ స్థానాలు పుట్టుకొస్తాయి. అంటే, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా గ్రామీణ ప్రాంతాల కంటే ఈ గ్రేటర్ బెల్ట్ సీట్లే అత్యంత కీలకం కానున్నాయి.ఈ స్థానాల పెంపు ఏ పార్టీకి రాజకీయంగా అడ్వాంటేజ్ ఇస్తుందనేది ఇప్పుడు అసలు సిసలైన చర్చ. నగర ఓటర్లలో మధ్యతరగతి, ఐటీ ఉద్యోగులు,



ఆంధ్రా మూలాలున్న సెటిలర్లు, ఉత్తరాది వలసదారులు ఎక్కువగా ఉంటారు. చారిత్రాత్మకంగా గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు మైగ్రెన్ట్స్ ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో బిజెపి , బిఆర్ఎస్ పార్టీలకు బలమైన ఓటు బ్యాంక్ ఉంది. డిలిమిటేషన్ వల్ల నగర సీట్లు పెరిగితే అర్బన్ క్లాస్, సెటిలర్ ఓటర్ల ప్రభావం మరింత పెరిగి బీజేపీ, బీఆర్ఎస్‌లకు కలిసివచ్చే అవకాశాలు ఎక్కువ . మరోవైపు, కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం గ్రామీణ తెలంగాణలో అత్యంత బలంగా ఉండి, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తక్కువ స్థానాలను కలిగి ఉంది. కాబట్టి అర్బన్ సీట్లు భారీగా పెరిగితే కాంగ్రెస్ తన రాజకీయ వ్యూహాన్ని మార్చుకోవాల్సి వస్తుంది. కాంగ్రెస్ గ్రామీణ ఓటు బ్యాంకును మాత్రమే నమ్ముకుంటే సరిపోదని, నగర నియోజకవర్గాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఈ కొత్త సమీకరణాలు స్పష్టం చేస్తున్నాయి. రూరల్ నియోజకవర్గాల్లో కూడా జనాభా ప్రకారం కొత్త స్థానాలు ఏర్పడతాయి కాబట్టి అక్కడ తులనాత్మకంగా కాంగ్రెస్‌కు పట్టు సాధించే వెసులు బాటు కూడా ఉంటుంది.రాబోయే డిలిమిటేషన్ తెలంగాణ పొలిటికల్ పవర్ సెంటర్‌ను రూరల్ కారిడార్ నుంచి అర్బన్ కారిడార్‌కు మళ్లించబోతోంది. ఏ పార్టీ అయితే గ్రేటర్ హైదరాబాద్ విస్తరిస్తున్న నూతన నియోజకవర్గాల్లో పట్టు సాధిస్తుందో, ఆ పార్టీకే రాష్ట్రంలో అధికార పీఠం దక్కే అవకా శాలు మెరుగ్గా ఉంటాయి. సామాజిక సమీకరణాలు, వలస దారుల ప్రభావం, ఐటీ-రియల్ ఎస్టేట్ రంగాల విస్తరణే రేపటి తెలంగాణ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి.

# భారీగా పెరగనున్న ఆస్తి పన్ను...

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని భవనాలు, స్థలాల యజమానులకు ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటి వరకు కొనసాగుతున్న ఆస్తిపన్ను అసెస్మెంట్ విధానంలో మార్పులు తీసుకువస్తూ పాలకవర్గం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై సాంప్రదాయ అద్దె ప్రాతిపదికన కాకుండా.. మార్కెట్ రేట్లకు అనుగుణంగా పన్నులు వసూలు చేసేందుకు వీలుగా కొత్త బిల్లును సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదిత నిబంధనలు అమల్లోకి వస్తే.. పట్టణ ప్రాంతాల్లో నివాస, వాణిజ్య ఆస్తులపై పన్ను భారం ఊహించని రీతిలో పెరగనుంది. హైదరాబాద్ నగరంలోని ఇళ్ల, వాణిజ్య సముదాయాల యజమానులపై ఆర్థిక భారం పెరగనుంది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న వార్షిక అద్దె విలువ విధానానికి స్వస్తి పలికి.. దానికి బదులుగా క్యాపిటల్ విలువ ఆధారంగా ఆస్తి పన్నును నిర్ణయించేందుకు ప్రభుత్వం సమగ్ర అర్బన్ రిఫార్మ్స్ (సీయూఆర్ఈ) ముసాయిదా బిల్లులో ప్రతిపాదనలు రూపొందించింది. ఈ నూతన సంస్కరణల వల్ల నగర పరిధిలోని నివాసాల యజమానులతో పాటు వాణిజ్య సముదాయాల యజమానులపై పన్ను భారం పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.కొత్తగా తీసుకురానున్న




'క్యూర్' ముసాయిదా బిల్లు ప్రకారం.. ఆస్తిపన్ను లెక్కించడానికి రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించే భూమి, భవనాల క్యాపిటల్ విలువనే ప్రధాన ప్రాతిపదికగా తీసుకోనున్నారు. సాధారణంగా రియల్ ఎస్టేట్ రంగానికి అనుగుణంగా మార్కెట్లో భూముల ధరలు, భవనాల విలువలు ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంటాయి. దీనివల్ల పన్ను శాతాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పెంచకపోయినా, భూముల మార్కెట్ విలువ పెరగడం వల్ల ఆస్తి పన్ను కూడా ప్రతి ఏటా ఆటోమేటిక్‌గా పెరుగుతూ పోతుంది.ఈ కొత్త ముసాయిదా చట్టంలో ఆస్తుల రకాన్ని బట్టి పన్ను శాతాలను ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇళ్లకు సంబంధించి క్యాపిటల్ విలువపై 0.10 శాతం నుంచి 0.50 శాతం వరకు పన్ను స్లాబ్‌లను వర్తింపజేయాలని ప్రతిపాదించారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు సంబంధించి క్యాపిటల్ విలువలో 0.20 శాతం నుంచి గరిష్టంగా 2.00 శాతం వరకు పన్ను స్లాబ్‌లను విధించనున్నట్లు స్పష్టం చేశారు.ఈ ప్రతిపాదిత విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే నగరంలో ఆస్తులు ఉన్న వారిపై ఆర్థికంగా ప్రభావం పడే అవకాశం ఉంది. పెరుగుతున్న భూముల రేట్లకు అనుగుణంగా ఏటా పన్ను పెరిగే నిబంధన ఉండటంతో.. భవిష్యత్తులో పన్ను భారం మరింత పెరగనుందని స్పష్టం అవుతోంది. అది జరిగితే యజమానులు తమపై పడే పన్ను భారాన్ని అద్దెలు పెంచడం ద్వారా పూడ్చుకోవడానికి ప్రయత్నిస్తారు. దీని వల్ల అంతిమంగా భారం అద్దెదారులపైనే పడే అవకాశం ఉంటుంది.

## బీఆర్ఎస్ డబుల్ బెడ్ రూమ్...

**హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరంలో సొంతింటి కోసం దశాబ్దాలుగా నిరీక్షిస్తున్న పేద, దిగువ మధ్యతరగతి ప్రజలను మరోసారి రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా స్కెచ్ వేసింది. నగర నడిబొడ్డున ఇందిరమ్మ టవర్స్ పేరుతో రూ. 40 నుంచి రూ. 60 లక్షల విలువైన ఫ్లాట్లను కేవలం రూ. 6 లక్షలకే ఇస్తామంటూ సరికొత్త సెంటిమెంట్ రగిలిస్తోంది. రూ. 5 లక్షల సబ్సిడీ, రిజర్వేషన్ల శాతం, మీ-సేవ దరఖాస్తులు అంటూ సుదీర్ఘమైన నిబంధనల జాబితాను ప్రకటిస్తూ.. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ స్కీమ్ తెరపైకి తెచ్చారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.గతంలో కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి, లక్షలాది మంది నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఓట్ల పండగ ముగిశాక పేదలను నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో నిర్మించిన అరకొర ఇళ్లకు పరిమితం చేసింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే కేసీఆర్ ఫార్ములా ను కాస్త రూపుమార్చి అమలు చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఉచితం అని చెప్పకుండా.. రూ. 6 లక్షల భాగస్వామ్యం పేరుతో ప్రజల నుంచి ఆశలు రేకెత్తించి, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికి ఈ దరఖాస్తుల హంగామా అని ఎక్కువ మంది నమ్ముతున్నారు.ప్రస్తుతం తొలి విడతగా 16 నియోజకవర్గాల్లో ఈ ఇందిరమ్మ టవర్స్ కడతామని చెబుతున్న ప్రభుత్వం, అసలు ఇళ్లకు సరిపడా భూములు ఎక్కడ ఉన్నాయో స్పష్టం చేయడం లేదు. పార్టీ చేస్తున్న విమర్శలను విష ప్రచారం అని కొట్టిపారేస్తున్న కాంగ్రెస్ నేతలు, గత ప్రభుత్వం చేసిన పాత తప్పులనే మళ్లీ పునరావృతం చేస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. మీ-సేవ కేంద్రాలు, వాట్సాప్ నంబర్లు ఇచ్చి దరఖాస్తులు తీసుకోగానే సరిపోదని, అసలు ఇళ్లు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పకుండా ఓటర్లను భ్రమల్లో ఉంచడమే కాంగ్రెస్ వ్యూహమన్న విమర్శలు ఉన్నాయి.గతంలో చూపించిన డబుల్ బెడ్‌రూమ్ డ్రీమ్ ఎలాగైతే ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నారో ఇప్పుడు ఇందిరమ్మ టవర్స్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహా పథకాన్ని అమలు చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పేదవాడికి నిజంగా ఇల్లు అందుతుందా లేదా అన్నది పక్కనబెడితే.. గ్రేటర్ ఎన్నికల వేళ ఈ ఇందిరమ్మ ఇళ్ల ప్రకటన మాత్రం హైదరాబాద్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర కలకలం రేపుతోంది. కానీ ఇప్పటికీ కేసీఆర్ నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు చాలా వరకూ పంపిణీ కాలేదు. కొన్నింటిలో పనులు పెండింగ్ లో ఉన్నాయి.

## ప్రతి నీటి చుక్కను సంరక్షించుకోవడం

## ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత:

### ఉస్మానియా విశ్వవిద్యాలయం సైఫాబాద్ సైన్స్ కళాశాలలో వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం




హైదరాబాద్‌లో భూగర్భ జలాలను పరిరక్షించడం, వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (జలమండలి) ఆధ్వర్యంలో నిర్వహించిన వర్షపు నీటి సంరక్షణ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ఇంజెక్షన్ పాయింట్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్, హార్వెస్టింగ్ బోర్‌వెల్స్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం "ప్రతి నీటి చుక్కను సంరక్షించుకుందాం ? పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే నినాదంతో మొక్కలు నాటి, వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను కాపాడేందుకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సైఫాబాద్ సైన్స్ కళాశాల విద్యాబోధనతో పాటు వర్షపు నీటి సంరక్షణలో ఆదర్శంగా నిలుస్తూ సమాజానికి మార్గదర్శకత్వం వహించడం అభినందనీయమన్నారు. నేటి పరిస్థితుల్లో ప్రతి వ్యవస్థ నీటిపైనే ఆధారపడి ఉందని, కురిసే వర్షపు నీటిని డ్రైనేజీల ద్వారా వృథాగా కాలువల్లోకి వెళ్లనివ్వకుండా భూగర్భ జలాల్లోకి ఇంకేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో రాతి నిర్మాణాలు, సిమెంట్ రోడ్ల విస్తరణ కారణంగా వర్షపు నీరు సహజంగా భూమిలోకి ఇంకే పరిస్థితి తగ్గిపోయిందని, అందువల్ల నగరంలోని ప్రతి ఇల్లు, ప్రతి సంస్థలో ఇంకుడు గుంతలు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. నిజాం కాలం నుంచే హైదరాబాద్‌లో నీటి సంరక్షణ కోసం అనేక చెరువులు నిర్మించారని గుర్తు చేసిన మంత్రి, ఆ సంప్రదాయాన్ని ఆధునిక పద్ధతులతో కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. 2016 నుంచి హైదరాబాద్‌లో భవన నిర్మాణ అనుమతుల్లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థను తప్పనిసరి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గత కొద్ది రోజులుగా నగరంలో రోజువారీ నీటి ట్యాంకర్ల వినియోగం సుమారు 4 వేల నుంచి 12 వేల వరకు పెరిగిందని పేర్కొంటూ, ఇది రాబోయే నెలల్లో నీటి అవసరం మరింత పెరిగే సూచనగా భావించాలన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించడంతో పాటు భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే 3 వేల నుంచి 4 వేల వరకు బోర్‌వెల్స్ ఎండిపోయాయని, అలాంటి బోర్‌వెల్స్‌కు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ఇంజెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేస్తే అవి తిరిగి నీటి నిల్వలను పొందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం హార్వెస్టింగ్ వ్యవస్థలను ప్రోత్సహిస్తున్నప్పటికీ ప్రజలు కూడా దీనిని తమ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కోరారు. కృష్ణా, గోదావరి, నాగార్జునసాగర్, సింగూరు, మంజీరా, ఎల్లంపల్లి వంటి ప్రాజెక్టుల ద్వారా రైతుల అవసరాలను సమన్వయం చేస్తూ హైదరాబాద్ నగరానికి తాగునీరు అందిస్తున్నప్పటికీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వర్షపు నీటి సంరక్షణే శాశ్వత పరిష్కారమని మంత్రి అన్నారు. 2024 అక్టోబర్ 2న రాష్ట్రంలో భారీ స్థాయిలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఈ కార్యక్రమం అమలులో రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో ఉండగా, త్వరలోనే మొదటి స్థానానికి చేరుకునే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. త్వరలోనే మంత్రుల నివాసాలు, కార్యాలయాలు, శాసనసభ, ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలోనూ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్‌ను తప్పనిసరి చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి కుటుంబం తమ ఇళ్లలోనే కాకుండా బంధువులు, స్నేహితుల ఇళ్లలో కూడా హార్వెస్టింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేసేలా చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌ను ఒక ఉద్యమంగా, సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టుకోవాలని, తద్వారా భావితరాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించగలమన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విధానాన్ని అమలు చేస్తోందని, వాహనం కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికీ ఒక మొక్కను అందించే కార్యక్రమాన్ని కూడా ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అల, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రజాప్రతినిధులు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నో ఏళ్ల నాటి కల నెరవేర్చేనా రైతులకు శాంతినగర్ రోడ్డు..







**గ్రామపంచాయతీ జనరల్ ఫండ్ నుండి గ్రావెల్ రోడ్డుకు శ్రీకారం చుట్టిన సర్పంచ్ వరలక్ష్మి రాజు...**

**కారేపల్లి,జూలై25(సూర్యరేఖ)** సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ గత ఎన్నో ఏళ్లుగా రైతు పొలాలకు వెళ్లడానికి అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అని తెలిసి ఎలబోయిన బిక్షపతి ఇంటి నుండి స్మశాన వాటి దాకా గ్రావెల్ రోడ్డు నిర్మాణం కొరకు తొలి ఏకాదశి శనివారం రోజున జెసిపి సహాయంతో రెండు వైపులా ముళ్ళ పోదాలను, సర్పంచ్ వరలక్ష్మీరాజు కొబ్బరికాయ కొట్టి, శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఎన్నోఏళ్ల నాటి ఈ రోడ్డును గత ప్రభుత్వంలో కూడా పట్టించుకోలేదు కావున ఇప్పుడు ఉన్న ఇందిరమ్మ రాజ్యంలో అనేక అభివృద్ధి పనులు చేసే విధంగా ప్రారంభించి,ముందుగా ఈ శాంతినగర్ రోడ్డు రైతు పొలాలకు మందు కట్టలు తీసుకొని వెళ్లాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.అనే విషయం అందరికీ తెలిసిందే కావున అదే తరహాలో గ్రామపంచాయతీ జనరల్ ఫండ్ నుండి గ్రావెల్ పోసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్నామని, అదేవిధంగా ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లులు లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తామని వారు తెలిపారు.అనంతరం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జన్మదిన సందర్భంగా వారికి ముందుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ భూక్యనిరంజన్,ఉపసర్పంచ్, పొడుగు విజయ సత్యం,కోఆప్షన్ సభ్యులు, మోరపాక శ్రీనివాస్,వార్డు సభ్యులు, ఉండం అజిత,భర్మావత్ భారతి,ధరం సోత్ అరుణ,లాకావత్ అరుణ రవి,ఇస్లావత్ హనుమాన్ నాయక్, ఉసిరికాయలపల్లి గ్రామశాఖ అధ్యక్షులు, రాచబండి నాగేశ్వరరావు,మాజీ ఎంపిటిసి గడ్డం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,రెడ్డబోయిన జగ్గయ్య, రెడ్డబోయిన శ్రీనివాస్, ఇస్లావత్ శంకర్ నాయక్,బోడ రవి,బోడ సెట్రాం,ఉడుగుల వెంకటేశ్వర్లు, మూడు రవి,బర్మావత్ శంకర్,గడ్డం శివ,గొల్ల మందల కాటయ్య,గడ్డం విశ్వనాథం,పచ్చిపాల వెంకన్న,పొడుగు శీను,లాకావత్ కిషన్,పొడుగు కన్నయ్య,ఇస్లావత్ హాథిరాం,భూక్యకళ్యాణ్, వాంకుడోత్ దేవజ్య,ఇస్లావత్ బన్సీ, పచ్చిపాల సైదులు,తదితరులు పాల్గొన్నారు.

## పట్నం రుక్కమ్మకు పరమేశ్వర్ రెడ్డి నివాళి



**ఉప్పల్,జూలై25 (సూర్యరేఖ)**తెలంగాణ శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ (ఎమ్మెల్సీ)డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి పట్నం రుక్కమ్మ (95)అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు.ఆమె మృతివార్త తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్,కాంగ్రెస్ నాయకుడు రఘుపతిరెడ్డితో కలిసి పట్నం మహేందర్ రెడ్డి నివాసానికి వెళ్లిన పరమేశ్వర్ రెడ్డి రుక్కమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం మహేందర్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...రుక్కమ్మ మరణం పట్నం కుటుంబానికి తీరని లోటని అన్నారు.ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.రుక్కమ్మ అంతిమయాత్రకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు,ప్రజాప్రతినిధులు,అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు.ఆమె మరణంతో కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులు,శ్రేయోభిలాషులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## రామంతాపూర్‌లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న

**మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్**



**రామంతాపూర్,జూలై 25( సూర్యరేఖ)** రామంతాపూర్ లోని నెహ్రూనగర్‌లో ఉన్న శ్రీశ్రీశ్రీ దుర్గ బద్ది పోచమ్మ దేవాలయంలో శనివారం నిర్వహించిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రత మహోత్సవంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ...భారతీయ సంస్కృతి,సనాతన ధర్మ సంప్రదాయాల ను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.సామూహికంగా నిర్వహించే సత్యనారాయణస్వామి వ్రతాలు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని,ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు జగదీష్,వర్కింగ్ ప్రెసిడెంట్ కొంపల్లి ఉపేందర్, జనరల్ సెక్రటరీ సేనాపతి,ట్రెజరర్ గాజుల సురేష్, ప్రజాప్రతినిధులు,బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్వాగతం..



**కామారెడ్డి,జూలై25(సూర్యరేఖ)** కామారెడ్డి,నిజామాబాద్ జిల్లాల్లో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మీనారాయణ,జస్టిస్ ప్రవీణ్ కుమార్,జస్టిస్ మాధవీ,లతలకు జిల్లా కలెక్టర్ పూల మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.హైకోర్టు న్యాయమూ ర్తులు శనివారం,ఆదివారం రెండు రోజులపాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు.

## ఓబీసీ జాతీయ మహాసభను విజయవంతం చేయండి..



**మందమర్రి,జూలై25(సూర్యరేఖ)** బెంగళూరులో ఆగస్టు 7న నిర్వహించనున్న అఖిల భారత 11వ జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేసేందుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేశారు.బీసీ మండల్ డే సందర్భంగా శనివారం పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకుడు కొండిల్ల శ్రీనివాస్ మాట్లాడు తూ...బీసీల హక్కుల పరిరక్షణ,సామాజిక న్యాయం,రాజకీయ సాధికారత లక్ష్యాలతో ఈ జాతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీలందరూ రాజకీయాలకు అతీతంగా ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు .మండల్ కమిషన్ సిఫార్సుల అమలుకు గుర్తుగా ప్రతి ఏడాది నిర్వహిస్తున్న జాతీయ ఓబీసీ మహాసభలకు ఈసారి బెంగళూరు వేదికగా నిలుస్తోందని చెప్పారు.ఈ ఏడాది డాక్టర్ మన్మోహన్ సింగ్ సిటీ యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగే 11వ జాతీయ మహాసభకు 29రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు.జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్,రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవి,రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీలకంఠేశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో తడిగొప్పుల రవిరాజా, రాయబారపు కిరణ్,మూడారపు శేఖర్,గాండ్ల సంజీవ్,మడ్డి వేణుగో పాల్ గౌడ్,జాడ క్రాంతికుమార్, గరిగె సుమన్,మాయ రమేష్,ఖలీం,చోటు, రెడ్డిరాజుల కిరణ్ తదితర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నాటి చెలిమి--నేటి కలిమి" పేరిట డీఎన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..



**హైదరాబాద్,జూలై 25జూలై25(సూర్యరేఖ)** భీమవరంలోని ప్రముఖ డి.ఎన్.ఆర్ కళాశాలలో 1977--1980 మధ్యకాలంలో బి.కాం చదివిన పూర్వ విద్యార్థులు"నాటి చెలిమి--నేటి కలిమి" పేరిట హైదరాబాద్ నారాయణగూడలోని తాజ్ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు.దాదాపు ఐదు దశాబ్దాల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్న పూర్వవిద్యార్థులు ఆనాటి కళాశాల రోజుల మధురస్మృతులను,స్నేహానుబంధాలను, అధ్యాపకులతో గడిపిన అపురూపమైన క్షణాలను నెమరువేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. పరస్పరం ఆప్యాయంగా పలకరించుకుంటూ తమ కుటుంబ,ఉద్యోగ,సామాజిక జీవిత విశేషాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా వారికి బి.కాం చదివే రోజుల్లో కామర్స్ బోధించిన విశిష్ట అధ్యాపకులు శ్రీమాణిక్యాలరావుని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.అనంతరం శ్రీమాణిక్యాలరావు మాట్లాడుతూ... విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహబంధాలు కాలగమనంలో మరింత బలపడతాయని, విద్యతో పాటు మంచి విలువలు,క్రమశిక్షణ,మానవతా దృక్పథం జీవిత విజయానికి పునాదులని పేర్కొన్నారు.తమ విద్యార్థుల విజయాలు తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయని అన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని సోమేశ్వరరాజు మరియు ముళ్ళపూడి వెంకటరమణ సమర్థవంతంగా నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ ఇటువంటి ఆత్మీయ సమావేశాలు తరచూ నిర్వహిస్తూ స్నేహబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు.ఈ సమావేశం ఆనందోత్సాహాల నడుమ ఆత్మీయ వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## వైరా శాసనసభ్యులు అభివృద్ధి ప్రదాత నమ్మిన సిద్ధాంతం కోసం..ఇచ్చిన మాట కోసం.. మడమ తిప్పని,నాయకుడు..

**తలవంచని పౌరుషం..తలపెట్టిన పనులు..**

**లక్ష్యం చేరేవరకు పోరాడే..ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కు జన్మదిన శుభాకాంక్షలు..**



**కారేపల్లి,జూలై25(సూర్యరేఖ)** సింగరేణి మండల హెడ్ కోటర్ సినిమా హాల్ సెంటర్ వద్ద వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు మాట్లాడుతూ...ముందుగా ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కటింగ్ చేశారు. అదేవిధంగా సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ...వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, అదేవిధంగా మన వైరా నియోజకవర్గ అభివృద్ధికి ఆయన పడుతున్న శ్రమ అంతా ఇంతా కాదు,నమ్ముకున్న ప్రజల కోసం వారు పడుతున్న శ్రమ ప్రజల గుండెల్లో ఎప్పటికీ అలానే ఉంటుందని,ప్రజల దీవెనలు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్,కు ఉండాలని వారు సూచించారు. తదంతరం రక్తదానం కార్యక్రమం ముందుగా సింగరేణి సర్పంచ్ మేదరి టోనీ ప్రారంభించడం జరిగింది. రక్తదాన కార్యక్రమములో వివిధ గ్రామపంచాయతీ సర్పంచులు,జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు,అభిమానులు, పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## బెల్లంపల్లిలో డబుల్ బెడ్‌రూమ్‌ల పంపిణీ వెంటనే చేపట్టాలి ఎంసీపీఐ(యు)




**బెల్లంపల్లి,జులై25(సూర్యరేఖ)** బెల్లంపల్లిలో లక్కీ డ్రా ద్వారా ఎంపికైన అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల తాళాలు వెంటనే అందజేయాలని ఎంసీపీఐ(యు)జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు.శనివారం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ...అప్పటి ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు జిల్లా కలెక్టర్ సమక్షంలో లక్కీడ్రా నిర్వహించి అర్హులను ఎంపిక చేశారని తెలిపారు.డ్రా నిర్వహించి మూడు నెలలు గడిచినా ఇప్పటివరకు ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించకపోవడం బాధాకరమన్నారు.డ్రాలో ఎంపికైన అర్హులు తమకు ఇళ్లు ఎప్పుడు అందుతాయోనని ఆందోళన చెందుతున్నారని,పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు.జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని డ్రాలో ఎంపికైన ప్రతి అర్హుడికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల తాళాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో డ్రాలో ఎంపికైన లబ్ధిదారులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తోగరి రాహుల్, ఆకాష్ పాల్గొన్నారు.

# కారేపల్లిలో ఎఫ్.పీ.వో అవగాహన సదస్సులో అధికారులు...

**కారేపల్లి,జూలై25(సూర్యరేఖ)** సమిష్టి తత్వాన్ని ప్రోత్సహించటమే రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్.పీ.వో)లక్ష్యమని కోఆపరేటీవ్ ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య అన్నారు.శనివారం కారేపల్లిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ,కారేపల్లి సోసైటీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు సంఘ అధ్యక్షులు దుగ్గినేని శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య మాట్లాడుతూ...సాంకేతికను అందుకోవటంతో చిన్న సన్నకారు రైతులు వెనకబడటం మూలంగా ఉత్పత్తి తగ్గి పెట్టుబడ్లు పెరుగుతున్నాయన్నారు.సాంకేతికను అందించటం కోసం ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంస్థను ఏర్పాటు చేసిందన్నారు. దీనిలో రూ.2వేలు కట్టి సభ్యత్వం తీసుకున్న రైతులకు ప్రభుత్వం మరో రూ.2వేలు వాటాగా కలుపుతుందన్నారు.ఎఫ్.పీ.వోలో 750 మంది సభ్యులు చేర్చుకునే అవకాశం ఉందన్నారు. కారేపల్లి సోసైటీలో 400మంది సభ్యులుగా చేరి ఉన్నారని అది పని ప్రారంభించిందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత డాక్టర్ కవిరాజ్ మాట్లాడుతూ... వరిని నేరుగా విత్తే పద్దతి ద్వారా ఖర్చు తక్కువ, నీటి అవసరం తక్కువతో పాటు అధిక ఫలసాయం వస్తుందన్నారు.దీనిలో పంట కాలం 15రోజు తగ్గుతుందన్నారు.అనంతరం భూసార పరీక్షల చేసే విధానాన్ని వివరించి కిట్ లను రైతులకు అందజేశారు. సమిష్టిత త్వంపైరైతులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్.పీ.వో డొమైన్ ఎక్స్ పర్ట్ చావా అరుంధతి,సీఈవో బొల్లు హనుంతరావు,దిశ కమిటీ సభ్యురాలు దారావత్ హేమలత బాలాజీ,సర్పంచ్ లు అంగోత్ మత్రు, ఈసాల వెంకటేశ్వరరావు,భూక్య పద్మ,భూక్య రంజిత్ కుమార్,పూసం



రామారావు,సోసైటీ డైరక్టర్లు అడ్డగోడ ఐలయ్య,దేగల ఉపేందర్,రైతు ప్రతినిధులు బానోత్ రాంమ్మూర్తి, కడియాల సుధాకర్,సురేందర్ మనియర్,కిలారి అప్పారావు,సూరపురెడ్డి విష్ణవర్ధన్ రెడ్డి, పెద్దబోయిన ఉమాశంకర్, ఆదెర్ల రాములు, అడపా పుల్లారావు,అజ్మీర నరేష్,కాసాని లక్ష్మినారాయణ ,గడ్డం వెంకటేశ్వర్లు,పెర్ని వెంకటేశ్వర్లు,వడ్డె అనంతయ్య, ఈసాల ఛాయాదేవి, నాగండ్ల జగన్,అజ్మీర ఈర్యా,చాగంటి వెంకటేశ్వర్లు, అజ్మీర హేమ్లా,బట్టు సంగయ్య,ధళ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా మాంట్ ఫోర్ట్ క్విజ్ విజ్-2026పోటీల నిర్వహణ..







**ఉప్పల్,జూలై25(సూర్యరేఖ)**ఉప్పల్ లోని ప్రముఖ విద్యాసంస్థ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ప్రతిష్టాత్మక మాంట్ ఫోర్ట్ క్విజ్ విజ్ -2026పూణే ప్రావిన్స్ ఇంట్రా ప్రావిన్స్ క్విజ్ పోటీల కార్యక్రమ వేడుకను పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ రెవరెండ్ బ్రదర్ జోసఫ్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో ప్రారంభించడం జరిగింది.అనంతరం సెయింట్ లూయిస్ మేరీ డి మాంట్ ఫోర్ట్ చిత్రపటానికి నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి తెలంగాణ ఈఎస్ఐసి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ( ఎన్ ఎఫ్ ఎస్ జి)డాక్టర్ ఎం.అరుణ మేరీ థెరిసా ముఖ్యఅతిథిగా విచ్చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరవనీయులు డాక్టర్ రెవరెండ్ బ్రదర్ జోసఫ్ మాట్లాడుతూ...అతిథుల స్వాగత పరిచయం గావించారు.అనంతరం ఈ క్విజ్ పోటీలు ముఖ్యంగా విద్యార్థులలో దాగి ఉన్న అసాధారణ పరిజ్ఞానాన్ని వెలికి తీసేందుకు విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు.అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ ఎం.అరుణ మేరీ థెరిసా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ ప్రతిష్టాత్మక క్విజ్ పోటీలలో ఆల్ సెయింట్స్ హైస్కూల్- హైదరాబాద్, లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ - అబిడ్స్,లిటిల్ ఫ్లవర్ పాఠశాల -ఉప్పల్,మాంట్ ఫోర్ట్ స్కూల్- కడప, మాంట్ ఫోర్ట్ స్కూల్ సి.బి.ఎస్.ఈ-ఫాతిమానగర్ (కాజీపేట),మాంట్ ఫోర్ట్ స్కూల్ సి.బి.ఎస్.ఈ - నల్గొండ వంటి వివిధ ప్రాంతాల విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.ఉత్కంఠ భరితంగా సాగిన ఈ క్విజ్ అనేక రౌండ్ ల అనంతరము ముగింపు వేడుకలో భాగంగా ప్రథమ స్థానంలో గెలుపొందిన ఆల్ సెయింట్స్ హై స్కూల్- హైదరాబాద్ మరియు ద్వితీయ స్థానంలో మాంట్ ఫోర్ట్ స్కూల్ సి.బి.ఎస్.ఈ -ఫాతిమానగర్ (కాజీపేట), తృతీయ స్థానంలో గెలుపొందిన లిటిల్ ఫ్లవర్ పాఠశాల -ఉప్పల్ విజేతలకు ముఖ్యఅతిథి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు మరియు వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# హబ్సీగూడలో సర్ హెల్ప్ డెస్క్ ను సందర్శించిన పరమేశ్వర్ రెడ్డి

హబ్సీగూడ డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు

**హబ్సీగూడ,జూలై25(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి శనివారం హబ్సీగూడ స్ట్రీట్ నంబర్ -8లోని గాంధీ గిరిజన బస్తీ కమాన్ వద్ద ఏర్పాటు చేసిన సర్ హెల్ప్ డెస్క్ ను సందర్శించారు. హబ్సీగూడ డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ హెల్ప్ డెస్క్ ను డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కుని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.బీఎల్వోలు,కాంగ్రెస్ బీఎల్ఏలు ఇంటింటికీ తిరిగి ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో సహాయం చేయాలని,ఇప్పటికే నింపిన ఫారాలను కలెక్ట్ చేసుకోవాలని సూచించారు.హబ్సీగూడలో సర్ పురోగతిపై స్వయంగా బీఎల్వోలను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో హబ్సీగూడ మాజీ డివిజన్ ప్రెసిడెంట్ గన్నారం విజయ్ కుమార్, జనరల్ సెక్రటరీ ధర్మానాయక్,సీనియర్ నాయకులు చింతల బాబురావు,మురళీ



కృష్ణముదిరాజ్,రాజు నాయక్,కిషన్ నాయక్,మాలునాయక్,జావేద్,ధర్మరాజు,యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వాసునాయక్, సాయికుమార్, సాయికిరణ్, సుమన్ నాయక్,శివ, అనిల్ మామిడాల, శివ,స్వాతి, జ్యోతి ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..

ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ



**మందమర్రి,జూలై25(సూర్యరేఖ)** పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పిలుపునిచ్చారు.శనివారం ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మందమర్రి మార్కెట్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు.ఈ సందర్భంగా సొసైటీ ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవా మాట్లాడుతూ... ప్రకృతిని కాపాడడమే మానవ మనుగడకు భరోసా అని అన్నారు.చెట్లు పెరగడం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గడంతో పాటు వర్షపాతం పెరగడానికి, జీవవైవిధ్యం పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు.కరోనా మహమ్మారి అనంతరం పరిశుభ్రమైన పర్యావరణం,స్వచ్ఛమైన గాలి విలువను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు."ఒక మొక్కను నాటడం గొప్ప పని కాదు.. దానిని సంరక్షించి చెట్టుగా పెంచడమే నిజమైన పర్యావరణ సేవ.ప్రతి ఇంటి వద్ద ఒక మొక్క, ప్రతి మనిషి చేత ఒక చెట్టు అనే లక్ష్యంతో ముందుకు సాగితేనే పచ్చని తెలంగాణ,పచ్చని భారత్ సాధ్యమవుతుంది"అని ఆయన అన్నారు. . ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నందిపాట రాజ్‌కుమార్,జిల్లా కార్యదర్శి సంజీవ్, మండల అధ్యక్షుడు సాకినాల శంకర్, మద్దెల సంజీవ్,జావీద్ పాషా,పృథ్వి ,దిలీప్,కుమారస్వామి, పప్పు వినోద్,అరం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలంటే ప్రాణం ఇచ్చే మనసున్న మహారాజు..

ప్రజల మధ్య ఉంటూ ప్రజాసేవ చేసే నాయకుడు



**ఖమ్మం,జులై25(సూర్యరేఖ)** కల్లూరు మండలం ముగ్గ వెంకటాపురం గ్రామ పంచాయితీలో మాజీ ఎంపీటీసీ కొండపల్లి శ్రీనివాస రావు(వాసు) పుట్టిన రోజు సందర్భంగా ముగ్గ వెంకటాపురంలో ముత్యాలమ్మతల్లి గుడి వద్ద మరియు మెయిన్ రోడ్డు వద్ద గల రామాలయంలో ఒక హ్యాండ్ బోరు మొత్తం కలిసి రెండు హ్యాండ్ బోరులు సొంత నిధులతో శనివారం వేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముగ్గ వెంకటాపురం సర్పంచ్ బేబీ స్వరాజ్యలక్ష్మి,సీనియర్ నాయకులు కొండపల్లి రాధాకృష్ణ,గ్రామ పెద్దలు కొండపల్లి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## పోరాట ఫలితమే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా..

టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య



**హైదరాబాద్,జూలై25(సూర్యరేఖ)** దేశవ్యాప్తంగా విద్యార్థులు,యువత పెద్దఎత్తున చేపట్టిన పోరాట ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని తెలంగాణ జన సమితి (టీజేఎస్)గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య పేర్కొన్నారు.కేంద్ర విద్యాశాఖమంత్రి రాజీనామా విద్యార్థులు సాధించిన విజయమని ఆయన కొనియాడారు .యువత తలచుకుంటే ఏ లక్ష్యాన్నైనా సాధించగలదనే విషయానికి ఈ పరిణామం నిదర్శనమని అన్నారు.నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాల వల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్న నరసయ్య,ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే, ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందించాలని కోరారు.విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని, భవిష్యత్తులో నీట్ పరీక్షల ను ప్రతి రాష్ట్రంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

# పాత్రికేయుల సమస్యలపై రేపే "ఛలో పార్లమెంట్' జంతర్ మంతర్ వద్ద ఒక రోజు ధర్నా..

ఢిల్లీకి బయలుదేరిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు, జర్నలిస్టులు..

**నాంపల్లి,హైదరాబాద్,జూలై25(సూర్యరేఖ)** కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యలపై రేపే తెలంగాణ జర్నలిస్టులు "ఛలో పార్లమెంట్"కార్యక్రమం చేపడుతున్నారు.ఇందులో భాగంగా ఈనెల27న ఢిల్లీలోని పార్లమెంట్ జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న శనివారం ధర్నాకి ఏర్పాట్లు జరిగాయి.తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి జర్నలిస్టులు ఇప్పటికే ఢిల్లీకి బయలుదేరారు.హైదరాబాద్,మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి,వరంగల్,ఖమ్మం,కరీంనగర్,నిజామాబాద్,సూర్యాపేట,మహబూబ్ నగర్ జిల్లాల నుంచి టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు శనివారం ఢిల్లీ బయలుదేరారు.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి,పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకు వెళ్ళి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ,తాము తొలిసారిగా "ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు.

ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యలు..

జర్నలిస్టుల రైల్వేరాయితీ పాస్ ల పునరుద్దరణ..

దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళు కొనసాగించిన రైల్వే రాయితీ సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం కోవిడ్ సందర్భంగా నిలిపివేసింది.దీనిని పునరుద్ధరించకపోవడంతో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు.ఇబ్బందులకు గురవుతున్నారు.

జర్నలిస్టుల రైల్వేరాయితీ పాసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని,దేశ వ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన నేపథ్యంలో వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో నేషనల్ మీడియా కమీషన్ ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

నేషనల్ పెన్షన్ స్కీం ప్రవేశ పెట్టాలి..

దేశవ్యాప్తంగా రిటైర్డ్,సీనియర్ జర్నలిస్టులు ఎటువంటి ఆదాయ వనరులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కొన్ని రాష్ట్రాలలో రిటైర్డ్,సీనియర్



జర్నలిస్టులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేక పోవడం వల్ల మిగతా రాష్ట్రాలలో ఈ స్కీం అమలుకావడంలేదు. అందుకే దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జర్నలిస్టుల రక్షణ చట్టం చేయాలి..

దేశంలోని అనేక రాష్ట్రాలలో జర్నలిస్టులపై దాడులు, హత్యలు,అక్రమ కేసుల బనాయింపు వంటి సంఘటనలు పెరిగిపోతున్నాయి.వీటిని అరికట్టేందుకు పార్లమెంట్ లో జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎలక్ట్రానిక్,డిజిటల్ మీడియాకు చట్టబద్దత కల్పించాలి..

ఎలక్ట్రానికి,డిజిటల్ మీడియాలకు పూర్తి స్థాయిలో చట్టబద్ధత లేకపోవడం వల్ల అనేక సమస్యలు, అనార్ధాలు ఎదురవుతున్నాయి.వెంటనే ఈ మీడియాలకు చట్టబద్దత కల్పించాలి.

ఇళ్ళస్థలాలపై సుప్రీం కోర్టు తీర్పును పునః సమీక్షించాలి..

పాత్రికేయ సంఘాలకు,జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూముల కేటాయింపును నిరాకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి,దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఇళ్ళ స్థలాలు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే ఛలో పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి తరలివెళుతున్నారు.ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లతో పాటు అనేకమంది నాయకులు,సభ్యులు బయలుదేరి వెళ్ళారు.

## కంటతడి పెట్టుకున్న సీనియర్ ప్రముఖ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు..

రవికీ కారేపల్లి ప్రముఖులు ఘనంగా నివాళి..


రవినాయక్ మృతి న్యాయవ్యవస్థకు తీరని లోటు అజ్మీరా వీరన్న



**కారేపల్లి,జూలై25(సూర్యరేఖ)**సీనియర్ న్యాయవాది ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవినాయక్ మృతి చాలా బాధాకరమని సీనియర్ ఖమ్మం ఉమ్మడి జిల్లాల న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా న్యాయవాది రవినాయక్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు.శనివారం మృతుడు రవినాయక్ దశదిన కార్యక్రమంలో కారేపల్లి మండలానికి చెందిన ప్రముఖులు పాల్గొని రవి నాయక్ చిత్రపటానికి పూలతో ఘనంగా నివాళు లర్పించా రు.ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాస ˇరావు మాట్లాడుతూ... రవినాయక్ తన వద్ద చిన్న వయసులో అడ్వకేట్ గా పనిచేశారని,తనకు తమ్ముడు లాంటివాడని అందరితో కలుపుకొని పోయే రవి చనిపోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు.గిరిజన కుటుంబంలో పుట్టిన అతను చిన్న వయసులోనే న్యాయవాధిగా వృత్తిని కొనసాగుతూ అంచలంచలుగా ఎదిగి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా చాలా కాలం పాటు పని చేశారని గుర్తు చేశారు.ఇల్లందు,కొత్తగూడెం పరిసర ప్రాంతా ల్లో కూడా గిరిజనులతో మమేకమై వారి సమస్యను తన సమస్యగా భావించి న్యాయపరంగా అందరిని న్యాయం చేశారని కొనియాడారు.రవి నాయక్ చిత్రపటానికి పూలమాల వేస్తూ సీనియర్ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు కంటతడి పెట్టుకున్నారు.చిన్న వయసులో చనిపోవడం చాలా బాధాకరమన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు హనుమకొండ రమేష్,ఆడప పుల్లారావు, దమ్మలపాటి ప్రసాద్,ప్రముఖ వ్యాపారవేత్త కాటేపల్లి నవీన్,న్యాయవాది ధారావత్ చందునాయక్, వాంకుడోత్ విజయ్,తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్‌లో ఘనంగా ఆషాఢ మాసం తొలి ఏకాదశి పూజలు..

**నిజాంపేట,జూలై25(సూర్యరేఖ)** ఆషాఢ మాసం తొలి ఏకాదశిని పురస్కరిం చుకుని నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మదేవిని శాకాంబరి రూపంలో ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో రైతులు పొలాల్లో నీటిలో ఎక్కువగా పనులు చేస్తుంటార ని,ఈ సమయంలో ఎలాంటి



అనారోగ్య సమస్యలు ఎదురుకాకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని అమ్మవారిని వేడుకుంటూ ప్రత్యేక పూజలు,ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పురోహితులు విశ్వేశ్వర శర్మ,గ్రామ సర్పంచ్ ప్రవీణ్,గౌడ సంఘం పెద్దలు,సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పెద్దవి ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.భక్తుల పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## చల్మెడలో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం..










**నిజాంపేట,జూలై25(సూర్యరేఖ)**మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో స్వయంభువుగా వెలిసిన శ్రీతిరుమలనాథస్వామి. దేవస్థానంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకోవడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వెంకట రామ్మోహన్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత రుద్రాభిషేకం,బిల్వార్చన,సామూహిక అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాల ను పంపిణీ చేసి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు.ఈ సందర్భంగా అర్చకులు వెంకటరామ్మోహన్ శర్మ మాట్లాడుతూ... తొలి ఏకాదశి సందర్భంగా తిరుమలనాథస్వామి ఆలయంలో శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ప్రతి సంవత్సరం దేవాదాయశాఖ, ఆలయ పాలకవర్గం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.భక్తిశ్రద్ధలతో స్వామివారిని ఆరాధించడం ద్వారా భక్తులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు కలుగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు,గ్రామస్తులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గోల్కొండ జగదాంబ మహంకాళిని దర్శించుకున్న జలమండలి సాంకేతిక అధికారి బి.నర్సింగ్ రావు.



**నాంపల్లి,హైదరాబాద్,జూలై 25(సూర్యరేఖ)** గోల్కొండ కోటపై కొలువు దీరిన శ్రీజగదాంబ మహంకాళి అమ్మవారి ఆషాఢమాస బోనాలను పురస్కరించుకొని హైదరాబాద్ మెట్రో వాటర్ అండ్ సీవరేజ్ బోర్డు సాంకేతిక అధికారి బి.నర్సింగ్ రావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి దీవెనలు అందుకొన్నారు.దేవాదాయశాఖ ఈఓ వసంత,జగదాంబ మహంకాళి ఆలయ ఛైర్మన్ ఆకుల చంద్రశేఖర్ అధికారి బి.నర్సింగ్ రావును సాదరంగా ఆహ్వానించి ఆలయ మర్యాదలతో సత్కరించి,తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా బి.నర్సింగ్ రావు మాట్లాడుతూ...భక్తులు అమ్మవారికి బోనం సమర్పిస్తే ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలుగుతాయని,రోగాలు తొలగిపోతాయని,కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం అన్నారు.

## రామ్‌రెడ్డినగర్‌లో ఓపెన్ నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం..

మాట నిలబెట్టుకున్న ఆకారపు అరుణ్ పటేల్‌కు కాలనీ వాసుల అభినందనలు..





**వెంకట్ రెడ్డినగర్,జూలై25(సూర్యరేఖ)** వెంకట్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని రామ్‌రెడ్డినగర్ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న ఓపెన్ నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.గతంలో ఇదే నాలాలో ప్రమాదవశాత్తు ఓవ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటనతో చలించిన సామాజిక కార్యకర్త ఆకారపు అరుణ్ పటేల్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి,సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి,నిరంతరం కృషి చేసి ఓపెన్ నాలాను కప్పివేసే పనులను పూర్తి చేయించారు.దీంతో కాలనీవాసులు ఊపిరిపీల్చుకున్నారు .ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా పనిచేస్తూ,మాట తప్పని నాయకుడిగా ఆకారపు అరుణ్ పటేల్ మరోసారి తన నిబద్ధతను చాటుకున్నారని స్థానికులు కొనియాడారు.ఈ సందర్భంగా పని పూర్తికి సహకరించిన ఆకారపు అరుణ్ పటేల్,జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు ,కాలనీ పెద్దలకు కాలనీవాసులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు సత్తయ్య, రామాలయం టెంపుల్ డైరెక్టర్ మల్లయ్య,భాను, అరుణ్,సాయికృష్ణ, అశోక్,భాస్కర్, సదానందచారి, కె.మహేష్,పాల బాలయ్య,నవీన్ పాషా,తదితరులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## యువత పోరాటానికి కేంద్రం దిగివచ్చింది..

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ హర్షం

**బెల్లంపల్లి,జులై25(సూర్యరేఖ)** దేశవ్యాప్తంగా విద్యార్థులు,యువత చేపట్టిన ఆందోళనల నేపథ్య ంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేం ద్రప్రధాన్ రాజీనామా చేయ డాన్ని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ స్వాగతించారు.ఇది యువత ఐక్యతకు లభించిన విజయ మని ఆయన పేర్కొన్నారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా కాదు.తమ హక్కుల కోసం దేశవ్యాప్తంగా యువత ఐక్యంగా చేసిన పోరాటం సాధించిన విజయం.యువత ఒక లక్ష్యం కోసం ఏకమైతే ఎంతటి ప్రభుత్వమైనా స్పందించాల్సిందేనని ఈ పరిణామం నిరూపించింది" అని అన్నారు.బీజేపీ ప్రభుత్వ అహంకార వైఖరికి ఈ రాజీనామా గట్టి సమాధానమని విమర్శించిన ఆయన, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.విద్యార్థుల భవిష్యత్తు, హక్కుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే యువతతో కలిసి మరోసారి ఉద్యమి స్తామని హెచ్చరించారు.చివరగా దేశవ్యాప్తంగా పోరాటంలో పాల్గొన్న విద్యార్థులు,యువతకు అభినందనలు తెలియజేస్తూ జైహింద్...జై భారత్ అని పేర్కొన్నారు

# ఢిల్లీ విద్యార్థులపై దాడులను ఖండిస్తూ కాక్రోచ్ జనతా పార్టీకి మద్దతుగా టీఆర్పీ నిరసన





బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్

**శేరిలింగంపల్లి,జులై25(సూర్యరేఖ)**తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న మరియు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి బంధారపు నరసయ్యగౌడ్ ఆదేశాల మేరకు,ఢిల్లీలో విద్యార్థులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ వారికి సంఘీభావం ప్రకటిస్తూ కాక్రోచ్ జనతా పార్టీకి మద్దతుగా ప్రకటించారు.తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి జిల్లా కార్యాలయం నుంచి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టీఆర్పీ రంగారెడ్డి జిల్లా నాయకులు ,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అల్విన్ ఎక్స్ రోడ్ వద్ద ధర్నా నిర్వహించి ,అనంతరం ర్యాలీ చేపట్టారు. ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థుల గొంతును అణిచివేసే చర్యలు సమంజసం కాదని,విద్యార్థులపై జరుగుతున్న దాడులను వెంటనే నిలిపివేసి వారి హక్కులు,భద్రతను పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాది అని,వారి స్వేచ్ఛ,భద్రత,ప్రజాస్వామ్య హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను అణచివేతతో కాకుండా చర్చలు,ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కరించాలని పిలుపునిచ్చారు.ఈ నిరసన కార్యక్రమంలో టీఆర్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బండారి రమేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్ ముదిరాజ్,రాష్ట్ర ఐక్య వేదిక అధ్యక్షులు భేరి రామ్‌చందర్ యాదవ్, విజయలక్ష్మి,వాసుకి,పొనుగోటి సందీప్,యాప్రాల్ రాజు,పద్మ,శ్రీకాంత్, శాగంటి శ్రీనివాస్,సంగమ్మ, మంగమ్మ,యాది,తిరుమల్, ప్రశాంత్ నగర్, బసవతారకనగర్ కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

## రూ.79లక్షలతో సీసీ రోడ్డు పనులు..అర్ధరాత్రి పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్ బన్నాలగీత





**చిలుకానగర్,జూలై25 (సూర్యరేఖ)**బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని జహీద్‌నగర్‌లో రూ.79లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ శనివారం అర్ధరాత్రి జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు.పిస్తాహౌస్ నుంచి విజ్ఞాన్ స్కూల్ వరకు,అలాగే న్యూ ప్రశాంత్‌నగర్ కాలనీలోని రోడ్ నెం.3లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను రాత్రి 12.30 గంటల సమయంలో కాలనీవాసులతో కలిసి ఆమె పర్యవేక్షించారు.ఈ సందర్భంగా బన్నాల గీత మాట్లాడుతూ...రూ.79లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.పిస్తాహౌస్ ప్రాంతంలో పగటిపూట అధిక ట్రాఫిక్ ఉండటంతో ప్రజలకు,వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అర్ధరాత్రి తర్వాత రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం తమ బాధ్యత అని,రాత్రైనా పగలైనా ప్రజాసమస్యల పరిష్కారానికే తమ కృషి కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జహీద్‌నగర్ అధ్యక్షుడు ఫారూఖ్, ఓబేద్,మీమేష్,నాయక్,శ్రీకాంత్ రెడ్డి,ఫసీ,సునీల్, మేరాజ్,జునైద్,న్యూ ప్రశాంత్‌నగర్ అధ్యక్షుడు బింగి శ్రీనివాస్,రవి,తదితరులు ,కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హెచ్ఎంటీనగర్ డివిజన్‌లో విస్తృతంగా ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమాలు..

ప్రజల ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా ప్రత్యేక ప్రచారం..

సాయిజెన్ శేఖర్





**నాచారం,జూలై25(సూర్యరేఖ)** ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు హెచ్ఎంటీనగర్ డివిజన్‌లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తెలిపారు.ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియ,ఎన్యుమరేషన్ దరఖాస్తు ఫారాల ప్రాముఖ్యతను వివరించేందుకు ప్రత్యేకంగా ఆటోను ఏర్పాటు చేసి,మైక్ ద్వారా కాలనీలు,బస్తీలలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును కాపాడుకునేలా ప్రజలకు ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.అంతేకాకుండా, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచన మేరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి,ఎన్యుమరేషన్ దరఖాస్తు ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సహాయం అందిస్తున్నామని తెలిపారు. అలాగే 2002 ఓటరు జాబితాలో తమ పేర్లను గుర్తించేందుకు అవసరమైన సహాయాన్ని కూడా అందిస్తున్నట్లు చెప్పారు.ఈ అవగాహన కార్యక్రమాల ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన లేని అనేక మంది ప్రజలు ముందుకు వచ్చి తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారని సాయిజెన్ శేఖర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విటల్ యాదవ్,వేముల మారయ్య,కట్ట బుచ్చన్న గౌడ్,చంద్రశేఖర్,పెంటయ్య, గణేష్,శ్రీనివాస్, నరసింహ,అశోక్,అరుణ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన..

ఐసిడిసిసూపర్వైజర్ లక్ష్మి..

**నిజాంపేట,జూలై 25(సూర్యరేఖ)** నిజాంపేట,రామాయంపేట మండలాల పరిధిలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల29వ తేదీన నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.రామాయంపేటలోని ప్రాజెక్టు కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు.ఆయా మండలాల పరిధిలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నిర్ణీత తేదీన హాజరై ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.


రామాయంపేట & నిజాంపేట్ మండలాలు -29.07.2026
1. డి. ధర్మారం-I
2. లక్ష్మాపూర్
3. దామరచెరువు LT
4. రామాయంపేట-II
5. కిషన్ తండా
6. చల్మెడ-II
7. K. వెంకటాపూర్
8. [illegible] తండా

[illegible] & మాసాయిపేట మండలాలు – 30.07.2026
1. [illegible]పూర్
2. M. జలాలపూర్
3. మహమ్మద్ నగర్ తండా
4. [illegible] పల్లి LT

ఆన్లైన్ ద్వారా ఇదివరకే దరఖాస్తులు చేసుకున్న మహిళా అభ్యర్థినులు ఎంపికకు కావాల్సిన (నోటిఫికేషన్ ప్రకారం) అర్హతలు మరియు ఇతర ధృవపత్రాలు పరిశీలించుటకు గాను అభ్యర్థినులను రావలసిందిగా కోరుతున్నాము. కావున అభ్యర్థినులు దరఖాస్తు చేసుకున్న ఆన్లైన్ రశీదు తో పాటు అన్ని ఒరిజినల్ మరియు 3 సెట్ జిరాక్స్ (గెజిటెడ్ అధికారి అటెస్టెడ్ చేసినది ఉండాలి) ధృవపత్రాలతో ICDS ప్రాజెక్టు రామాయంపేట, MPDO ఆఫీసు పక్కన రామాయంపేట నందు సంబంధిత మండలాల వారీగా మాత్రమే పైన తెలిపిన తేదీలలో ఉదయం 10.00 గంటలకు హాజరు కాగలరు.

## ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలి..



**నిజాంపేట,జూలై25(సూర్యరేఖ)**మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో (టీజీ) జలసిరి కార్యక్రమంలో భాగంగా శనివారం మండల ఏపీఓ శ్రీనివాస్ అధ్యక్షతన మహిళా సంఘాల సభ్యుల సమక్షంలో ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు,పంట పొలాల్లో పంట కుంటలు (ఫామ్ పాండ్లు),గ్రామానికి ఊట కుంట,సామాజిక ఇంకుడు గుంతలు(కమ్యూనిటీ సోక్‌పిట్లు), బోర్‌వెల్ రీచార్జ్ తదితర పనులపై అవగాహన కల్పించారు.ఈ పనులు చేపట్టడం ద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు కూలీలకు ఉపాధి లభిస్తుందని, ఎల్‌నినో వంటి వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు వివరించారు.ఆసక్తి ఉన్న గ్రామస్తులు తమ పట్టా పాస్‌బుక్ జిరాక్స్,ఉపాధి హామీ పని బుక్ జిరాక్స్ పత్రాలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శ్యామల శివరాములు,వార్డు సభ్యులు మహిపాల్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలరాజ్, మహిళా సంఘాల సీసీ రవీందర్,వీఓఏలు సునీత,సుజాత,ఎస్‌హెచ్‌జీ మహిళలు,ఆశా వర్కర్లు పావని,పద్మ,లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శని దేవుని విగ్రహం కోసం దేవాలయానికి రూ.50 వేల విరాళం..



**నిజాంపేట,జూలై25(సూర్యరేఖ)**మండల పరిధిలోని చల్మెడ గ్రామంలోని శ్రీతిరుమల స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించనున్న శ్రీశనిదేవుని విగ్రహం కోసం కొనాపూర్ గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్ గౌడ్,కవిత,కుమార్తె అశ్వితతో పాటు వారి కుటుంబ సభ్యులు రూ.50వేల విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు వారి ఉదార సహాయానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.శ్రీ శనిదేవుని,శ్రీతిరుమలస్వామి వారి దివ్య అనుగ్రహం బండి శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పురోహితులు వెంకటరామ్మోహన్,సర్పంచ్ బొమ్మన మల్లేశం,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నగరం గ్రామంలో జలసిరి కార్యక్రమంపై ప్రత్యేక గ్రామసభ..

భూగర్భ జలాల పెంపు,ఉపాధి కల్పనపై అవగాహన



**నిజాంపేట,జూలై25 (సూర్యరేఖ)**మండల పరిధిలోని నగరం గ్రామంలో విబీజీరం--జీ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న జలసిరి కార్యక్రమం సందర్భంగా శనివారం ఎంపీడీవో రాజిరెడ్డి అధ్యక్షతన,గ్రామ సర్పంచ్ అంతంపల్లి సుశీల సమక్షంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు,పంట పొలాల్లో పంట కుంటలు,ఊరికి ఊట కుంటలు,కమ్యూనిటీ సోక్‌పిట్లు,బోర్‌వెల్ రీచార్జ్ వంటి నీటి సంరక్షణ పనులపై అవగాహన కల్పించారు.ఈ పనుల అమలుతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు గ్రామీణ కూలీలకు ఉపాధి లభిస్తుందని,ఎల్‌నినో వంటి వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ఎంపీడీవో రాజిరెడ్డి తెలిపారు.అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటడంతో పాటు,హోమ్‌స్టెడ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంతంపల్లి సుశీల,గ్రామ పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్,ఉపసర్పంచ్ నాజం, వార్డు సభ్యులు సుభాష్,లక్ష్మణ్,గ్రామస్థాయి అధికారులు,సీనియర్ మేట్ గోపి,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# పంట మార్పిడితోనే రైతులకు,సమాజానికి మేలు..

వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి..
పెసర విత్తనాలు వేసి పంట మార్పిడి కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్..
సేంద్రీయ సాగుకు ప్రోత్సాహం..తక్కువ రసాయనాలతో పండిన పంటలకు మార్కెటింగ్..
మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్





**మరిపెడ,జూలై25(సూర్యరేఖ)** మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ సూచించారు.శనివారం మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామానికి చెందిన గిరిజన రైతు బాదావత్ వీరన్న--బుజ్జి దంపతుల పొలంలో పెసర విత్తనాలు వేసి పంట మార్పిడి కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...వాతావరణ మార్పులు,అకాల వర్షాలు,ఎల్-నినో ప్రభావం వంటి పరిస్థితులను ఎదుర్కోవాలంటే వరి,మొక్కజొన్నలకే పరిమితం కాకుండా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులు తమ భూమిని భాగాలుగా విభజించి వివిధ రకాల పంటలను సాగు చేయడం ద్వారా ఆదాయం పెంచుకోవచ్చన్నారు.ఈ సందర్భంగా భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ అభివృద్ధి చేసిన అర్క తేజస్వి మిరప విత్తనాల పంపిణీని ప్రారంభించారు.ఈ రకం ద్వారా ఎకరానికి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయ్ చంద్ర,జిల్లా ఉద్యానశాఖ అధికారి జై.మరియన్న,కెవికె మల్యాల కోఆర్డినేటర్ భాను,దిలీప్ కుమార్,ప్రిన్సిపల్ సైంటిస్ట్ ప్రశాంత్ నాయక్,ఇరిగేషన్ శాఖ ఈఈ కే. లక్ష్మారావు,ఏడిఏ మురళి,తహశీల్దార్ కృష్ణవేణి,ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి,ఏఓ బోడ వీరాసింగ్,మున్సిపల్ చైర్మన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి,వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,స్థానిక సర్పంచ్ లచ్చపతి నాయక్,గుర్రప్పతండా తండ సర్పంచ్ శరత్ నాయక్,తండా ధర్మారం సర్పంచ్ బాబునాయక్,ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి,కాంగ్రెస్ మండల పార్టీ ప్రెసిడెంట్ రఘువీరారెడ్డి ,ప్రజాప్రతినిధులు,వ్యవసాయ,ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు,నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ భవన్‌లో ఘనంగా ఏకలవ్యుడి జయంతి వేడుకలు..

ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహణ..
ఏకలవ్యుడి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు..



**హైదరాబాద్,జూలై25(సూర్యరేఖ)** భారతీయ సంస్కృతిలో గురుభక్తి,అంకితభావానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు ఏకలవ్యుడి జయంతి వేడుకలు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కురకుల మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ శంకర్ నాయక్ హాజరై ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఏకలవ్యుడు గురుభక్తికి ,పట్టుదలకు,క్రమశిక్షణకు ప్రతీక అని పేర్కొన్నారు.ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నప్పటికీ తన లక్ష్యాన్ని సాధించేందుకు అంకితభావం తో కృషి చేసిన ఏకలవ్యుడి జీవితం నేటి యువతకు ఆదర్శమని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని,విద్య,క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు.ఈ సందర్భంగా కురకుల మల్లికార్జున్ మాట్లాడుతూ... ఆదివాసీ సమాజం ఏకలవ్యుడి త్యాగస్ఫూర్తిని,ఆత్మగౌరవాన్ని స్ఫూర్తిగా తీసుకుని సామాజిక,విద్యా,ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు.ఆదివాసీల హక్కుల పరిరక్షణతో పాటు వారి అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుతాడి కుమార్, మోహన్,సత్యనారాయణ, నల్లగొండ శ్రీను,శేఖర్, శివకుమార్,భీక్షం,మేడ శ్రీను,భాస్కర్,రాములు, నరేష్,సహదేవ్, సుధాకర్,శ్యామ్,వెంకటేష్,శ్యామల, శైలజ,సదానందం,రమేష్, లింగయ్య, తిరుపతి,కె. సమ్మయ్య,పి.నరసింహులు,భరత్,అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే మా లక్ష్యం..

పడాల అనంతకృష్ణ

**నాంపల్లి,హైదరాబాద్,జూలై25(సూర్యరేఖ)**కార్వాన్ నియోజకవర్గంలో తుప్పు పట్టి ప్రమాదకరంగా మారిన ఇనుప ఎలక్ట్రికల్ స్తంభాలను తక్షణమే మార్చాలని కొన్ని నెలల క్రితం సూపరింటెండెంట్ ఇంజనీర్ కి భారతీయ జనతా పార్టీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శులు పడాల అనంతకృష్ణ వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా పడాల అనంతకృష్ణ మాట్లాడుతూ..మా వినతికి సానుకూలంగా స్పందించిన ఎస్ఈ శుక్రవారం స్వయంగా ఏరియా విజిట్ నిర్వహించి,ప్రమాదకరమైన ఐరన్ స్తంభాలను వెంటనే మార్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారని తెలిపారు.అదే విధంగా ప్రతి పండుగ సందర్భంగా జరిగే ఊరేగింపులకు ఆటంకంగా ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్లను కూడా కొత్తగా 9.1మీటర్ల పోల్స్ ఏర్పాటు చేసి మరింత ఎత్తుకు మార్చాలని ఆదేశించారని,దీంతో ప్రజల భద్రతతో పాటు ఊరేగింపులు కూడా సజావుగా నిర్వహించేందుకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు.మా వినతి పత్రానికి వెంటనే స్పందించి ఏరియా విజిట్ నిర్వహించి పనులకు ఆమోదం తెలిపిన ఎస్ఈకి,అలాగే సహకరించిన ఏఈకి,లైన్‌మన్ లడ్డూలకి పడాల అనంతకృష్ణ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.




## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన సెయింట్ క్లారిటీ పాఠశాల బస్సు..

ఇద్దరు విద్యార్థులకు స్వల్పగాయాలు..

**మేడ్చల్,జూలై25 (సూర్యరేఖ)** ఎల్లంపేట జాతీయ రహదారిపై శనివారం ఉదయం అత్వెల్లికి చెందిన సెయింట్ క్లారిటీ పాఠశాల బస్సు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 15మంది విద్యార్థులు ఉన్నారని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే స్పందించి 108సహాయంతో గాయపడిన డ్రైవర్‌తో పాటు ఇద్దరు విద్యార్థులను సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.మిగిలిన విద్యార్థులు సురక్షితంగా బయటపడడంతో పెద్ద ప్రమాదం తప్పింది.స్థానికుల కథనం ప్రకారం,బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం,అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.




## గాంధీభవన్ లో ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు..



**నాంపల్లి,హైదరాబాద్,జూలై25(సూర్యరేఖ)**గురుభక్తికి, పట్టుదలకు, త్యాగానికి ప్రతీక అయిన ఏకలవ్య జయంతిని ప్రతి ఏటా ఆషాఢ మాసంలో తొలి ఏకాదశి రోజున నాంపల్లి గాంధీభవన్ లో ఏకలవ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్సీ,ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ ఛైర్మెన్ శంకర్ నాయక్,అతిధులుగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కుమార్,సీనియర్ కాంగ్రెస్ నాయకులూ,తెలంగాణ ఆదివాసి ఎరుకల ఏకలవ్య కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు కూరాకుల కృష్ణ లు పాల్గొని ఏకలవ్యుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ...ద్రోణాచార్యుడిని తన గురువుగా భావించి విలువిద్యనభ్యసించాడని,ఆయన గురు భక్తికి, వీరత్వాన్నికి ప్రతీక అన్నారు.కురు పాండవులకు దీటుగా విలువిద్యలో రాటుదేలి శబ్దబేరిలో ఎవరికి దక్కని పేరు,ప్రఖ్యాతులు సొంతంచేసుకొని తన వ్రేలు విడిచి విల్లు విడిచి ఇలలో ఇలవేల్పుగా నిలిచిన చారిత్రక తన చరిత్రను నిలుపుకున్న మహౌన్నతుడని కొనియాడారు.ఆషాడ మాసంలో వచ్చే తోలి ఏకాదశి రోజున ఆ మహావీరుడు జయంతి శుభసందర్భంగా ప్రపంచ ఆదివాసి అందరి తరపున ఎరుకల సోదరులు ఏకలవ్య జయంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎరుకల సోదరులు ఉండాడి సత్యనారాయణ,డాక్టర్ మానుపాటి వినోద్ కుమార్,చర్ల రమేష్,కేంసారం ఎల్లయ్య,శివ కుమార్,శ్రీరామ్,దేవరాయ సుధాకర్,నల్గొండ సమ్మయ్య, చందులాల్ నాయక్,నల్లగొండ మల్లేశ్వరి,కేంసారం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## దళిత యువకుడు మేఘనాథ్‌కు టీపీసీసీ ఎస్సీ విభాగం సంఘీభావం..



**హైదరాబాద్,జూలై25(సూర్యరేఖ)** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఎన్‌బీటీ నగర్‌లో ఇటీవల దళిత యువకుడు మేఘనాథ్ పై జరిగిన దాడిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)ఎస్సీ విభాగం తీవ్రంగా ఖండించింది.దాడి విషయం తెలుసుకున్న వెంటనే టీపీసీసీ ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ నరేన్ రాజా అనరేలి,జనరల్ సెక్రటరీ తుమ్మల సందీప్ భూషణ్,ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్,సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు దాసరి శ్యామ్ సుందర్,సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.ఎన్.రామ్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న మేఘనాథ్‌ను పరామర్శించారు.అలాగే ఆయన తల్లిదండ్రులను కలిసి ధైర్యం చెప్పి సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...దాడికి పాల్పడిన నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం,పోలీసు అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు.ఈ ఘటన వివరాలను టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్,మనకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.భవిష్యత్తులో షెడ్యూల్డ్ కులాలపై ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని,బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని టీపీసీసీ ఎస్సీ విభాగం నాయకులు పేర్కొన్నారు.

## నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలి..

కమిషనర్ రమేశ్

**బెల్లంపల్లి,జులై25 (సూర్యరేఖ)** వర్షాకాల ంలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టి అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్ అధికారులను ఆదేశించారు.శనివారం బెల్లంపల్లి పట్టణంలోని ఇంక్లైన్ బస్తీ 6వ వార్డులో కమిషనర్ పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కాలనీవాసులు నాళాల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగి జ్వరాలు వస్తున్నాయని,డ్రైనేజీల మరమ్మతులు చేపట్టి పారిశుద్ధ్యాన్ని మెరుగుపర చాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ రమేశ్ వెంటనే నీరు నిల్వ కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, డ్రైనేజీలను శుభ్రపరచడంతో పాటు పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వర్షాకాలంలో అంటువ్యాధులు వ్యాపించకుం డా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## మేడ్చల్‌లో అక్రమ ఆక్రమణలపై ఉక్కుపాదం..

**స్టేషన్ రోడ్డులో అక్రమ నిర్మాణాల తొలగింపు..**

**ఏసీపీ భాస్కర్ గౌడ్ పర్యవేక్షణలో ప్రత్యేక డ్రైవ్**




**మేడ్చల్,జూలై25(సూర్యరేఖ)** మేడ్చల్ పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డుపై ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందిగా మారిన అక్రమ ఆక్రమణలను అధికారులు శనివారం తొలగించారు. ఏసీపీ భాస్కర్ గౌడ్ పర్యవేక్షణలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో జేసీబీ సహాయంతో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన టీడబ్బాలు,తాత్కాలిక నిర్మాణాలు, షాపుల ముందు ఉన్న షెడ్లను తొలగించారు.దీర్ఘకాలంగా రహదారిని ఆక్రమించడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించిన అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ఆక్రమణలు తొలగించడంతో రహదారి విశాలంగా మారి వాహనాల రాకపోకలు సులభతరం అయ్యాయి. స్థానికులు కూడా ఈ చర్యను స్వాగతించారు.ఈ సందర్భంగా అధికారులు ప్రభుత్వ స్థలాలు, రహదారులను ఆక్రమించకుండా ప్రజలు సహకరించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా మళ్లీ ఆక్రమణలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీపీఎస్ సాయి తేజ,టౌన్ ప్లానింగ్ సిబ్బంది రాజేష్,అఫ్రోజ్, మధు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఒక్కటే పరిష్కారం కాదు..

**నీట్ పేపర్ లీకేజీ బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి..**

**సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఎండి అబ్దుల్ రషీద్**




**మరిపెడ,జూలై25(సూర్యరేఖ)** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయడం ఒక్కటే పరిష్కారం కాదని,ఈ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఎండి అబ్దుల్ రషీద్ డిమాండ్ చేశారు.మరిపెడ మండల కేంద్రంలోని రాజీవ్ సెంటర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ...నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన ఘోర వైఫల్యానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని అన్నారు.ఈ వ్యవహారంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.నీట్ పేపర్ లీకేజీ కారణంగా తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు తక్షణ న్యాయం చేయాలని,మరణించిన విద్యార్థుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పారదర్శకత,భద్రతా ప్రమాణాలను మరింత పటిష్ఠం చేయాలని,నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# పాఠశాలల రక్షణకు కొత్త శకం







**--యునైటెడ్ స్కూల్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ బి.విజయేందర్ రెడ్డి**

**136మందికి పైగా పాఠశాల ప్రతినిధులతో అవగాహన సదస్సు విజయవంతం..**

**ఉప్పల్,జూలై25(సూర్యరేఖ)** పాఠశాలల భద్రత,రక్షణ,గౌరవ పరిరక్షణ లక్ష్యంగా యునైటెడ్ స్కూల్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశం విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుంచి 136మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశం లో యునైటెడ్ స్కూల్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రతినిధి విజేందర్ రెడ్డి.బి మాట్లాడుతూ.. .పాఠశాలల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలోని ఏ పాఠశాలకు ఎలాంటి సమస్య ఎదురైనా,ఆ సంస్థకు అండగా నిలిచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పాఠశాలలు ఎదుర్కొంటున్న పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా బ్లాక్‌మెయిల్,వేధింపుల నుంచి పాఠశాలలకు రక్షణ,ఆర్టీఐ చట్టంపై అవగాహన, పాఠశాల ప్రాంగణాల్లో అనధికార ప్రవేశాలను అరికట్టడం,పాఠశాల యాజమాన్యాలు--పోలీసు శాఖ మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.అనంతరం ఎస్ఐ మధు విద్యార్థుల్లో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం,సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ...పాఠశాలలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లను ప్రస్తావించి వాటి పరిష్కార మార్గాలను వివరించారు.పాఠశాల యాజమాన్యాలు, పోలీసుశాఖ పరస్పర సహకారంతో పనిచేస్తే విద్యార్థులు,ఉపాధ్యాయులు, విద్యాసంస్థలకు సురక్షితమైన,క్రమశిక్షణతో కూడిన, వేధింపులు లేని వాతావరణాన్ని నిర్మించవచ్చని పేర్కొంటూ సమావేశం ముగిసింది.

# కాటేదాన్‌లో మందకొడిగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ..

**బూత్ స్థాయి అధికారులు ఇంకా పోలింగ్ కేంద్రాలకే పరిమితం.. గడువు పొడిగించినా లక్ష్యాన్ని చేరుకోవడం కష్టం..**

**ఇంటింటికీ నమోదు ఫారాలు చేరడం ఆశించిన స్థాయిలో లేదు..**

**బీఆర్ఎస్ కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్**





**రాజేంద్రనగర్,జులై25(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని కాటేదాన్ డివిజన్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ఆశించిన వేగంతో కొనసాగడం లేదని బీఆర్ఎస్ కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు.నేతాజీనగర్,వెంకటేశ్వరకాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీలలో ఎన్నికల అధికారులు,బూత్ స్థాయి అధికారులతో కలిసి ఇంటింటి సర్వే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ అమలుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ..చాలా మంది బూత్ స్థాయి అధికారులు ఇంకా పోలింగ్ కేంద్రాలకే పరిమితమవుతున్నారని,దీంతో ఇంటింటికీ నమోదు ఫారాలు చేరడం ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు.ప్రస్తుతం సుమారు 40శాతం మాత్రమే ప్రక్రియ పూర్తయిందని,ఇదే పరిస్థితి కొనసాగితే గడువు పొడిగించినా లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమని పేర్కొన్నారు.బూత్ స్థాయి అధికారులు కేవలం ఇతరులు ఇచ్చిన సమాచారం ఆధారంగా తొలగించిన ,మారిన,మరణించిన ,రెండుసార్లు నమోదైన,నకిలీ ఓట్ల నమోదులు చేయకుండా,ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల నుంచి నేరుగా వివరాలు సేకరించి,అవసరమైన పత్రాలు పరిశీలించిన తర్వాతే నమోదు చేయాలని సూచించారు.లేకపోతే అర్హులైన ఓటర్ల పేర్లు పొరపాటున జాబితా నుంచి తొలగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఓటు హక్కు రక్షణ కోసం క్షేత్రస్థాయి ధృవీకరణ తప్పనిసరి అని,దీనిపై మండల రెవెన్యూ అధికారితో పాటు సంబంధిత ఎన్నికల అధికారులు వెంటనే దృష్టి సారించాలని ఆయన కోరారు.ప్రతి ఇంటికి నమోదు ఫారం చేరేలా చర్యలు తీసుకుంటేనే ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షించబడుతుందని అన్నారు.శ్రీరామ్‌నగర్‌లో అధికారులు,బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించిన విధానాన్ని ఇతర ప్రాంతాల్లో కూడా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యుగేందర్‌రెడ్డి,సర్కిల్ అధికారులు విజయేందర్, ఉపేందర్,గ్రామరెవెన్యూ అధికారి సరిథ,బూత్ స్థాయి అధికారులు అరుణరెడ్డి,శ్రీదేవి,సురేష్,రాఫికతో పాటు కొంపల్లి జగదీష్,వెంకట్‌రమణ కురువ,రామారావు,అనిల్,ఉప్పెల శ్రీను,రవి, సింహాద్రి,రిషి,సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి నియోజకవర్గ పెయింటర్స్ గౌరవ అధ్యక్షుడిగా ప్రభాకర్ ఏకగ్రీవ ఎన్నిక..



**బెల్లంపల్లి,జులై25(సూర్యరేఖ)** బెల్లంపల్లి నియోజకవర్గ పెయింటర్స్ గౌరవ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా బెల్లంపల్లిలో నిర్వహించిన నియోజకవర్గ పెయింటర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పెయింటర్స్ యూనియన్‌కు శాశ్వత కార్యాలయం ఏర్పాటు కోసం ఎమ్మెల్యేతో మాట్లాడి స్థలం కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పెయింటర్ల హక్కుల పరిరక్షణ,సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటామని,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ పెయింటర్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు.సమావేశంలో పెయింటర్స్ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొని ప్రభాకర్‌కు అభినందనలు తెలిపారు.

# తొలి ఏకాదశి..భక్తి పారవశ్యం..

## శ్రీవెంకన్న గుట్టపై బారులు తీరిన భక్తులు

## మార్మోగిన గోవింద నామస్మరణ..

## అనంతరం భక్తులకు అన్నదానం వితరణ...

**రాజేంద్రనగర్,జూలై25(సూర్యరేఖ)** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో దేవాలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి.మైలార్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం టీఎన్‌జీఓఎస్ కాలనీలో వెలసిన శ్రీవెంకన్నగుట్ట శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం ప్రాంగణం కిక్కిరిసి పోయింది.అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిళ్లతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించారు.స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అభిషేకం,నిజపాద దర్శనం భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది.తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని,పవిత్ర నిజపాదాలను దర్శించుకున్న భక్తులు..విశేష భక్తి భావంతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు మాట్లాడుతూ...తొలి ఏకాదశి రోజున శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనం,నిజపాద దర్శనం అత్యంత పుణ్యప్రదమని పేర్కొన్నారు.స్వామివారి దివ్య కృపాకటాక్షాలు సమస్త భక్తులపై సదా ఉండాలని ఆకాంక్షించారు.ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ నెలకొనగా, దేవాలయం నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.దర్శనం అనంతరం భక్తులకు వివిధ రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు.ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా సాగిన తొలి ఏకాదశి



వేడుకలు భక్తులకు భక్తి,ప్రశాంతతను పంచగా శ్రీ వెంకన్నగుట్ట ఆలయం మరోసారి పరిసర ప్రాంత భక్తుల విశ్వాసానికి నిలయంగా నిలిచింది. తొలి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.వందలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పులిజాల వివేకానంద,సంకురి జయప్రకాశ్,బొల్లా వెంకటేష్, శ్రీకాంత్,తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఊరూరా విస్తృత స్థాయిలో జలసిరి కార్యక్రమాలను చేపట్టాలి..

రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క.




**కామారెడ్డి,జూలై25(సూర్యరేఖ)** ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విస్తృత స్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) సూచించారు.అన్ని జిల్లాల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)లు, డీ.ఆర్.డీ.ఓలు,జెడ్పీ సీ.ఈ.ఓలు,గ్రామీణ నీటి సరఫరా,పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో,ఎం.పీ.డీ.ఓలతో మంత్రి సీతక్క శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెర్ప్ సీ.ఈ.ఓ దివ్యదేవరాజన్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ప్రతీకూల పరిస్థితుల్లో వీబీజీ రామ్–జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడుగుంతలు,ఊట కుంటలు, పంట కుంటలు,బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు విరివిగా చేపట్టి కూలీలకు ఉపాధి కల్పించాలని అన్నారు.గ్రామ సభలను నిర్వహిస్తూ ఈ పనుల ఆవశ్యకత గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని,వచ్చే ఆగస్టు 15వ తేదీ నాటికి అన్ని గ్రామాలలో ఈ పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు.రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ దిశగా ప్రభుత్వం వీబీజీ రామ్–జీ పథకం కింద ఇంకుడుగుంతలు,పంట కుంటలు,ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇస్తోందని,ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో విరివిగా జలసిరి కార్యక్రమం అమలయ్యేలా చూడాలన్నారు.ఈ పనుల పరిశీలన కోసం మండల స్థాయిలో గ్రామీణ నీటి సరఫరా ఏ.ఈ,పంచాయతీరాజ్ ఏ.ఈ, ఎం.పీ.డీ.ఓ,ఎం.పీ.ఓ, ఏ.పీ.ఓల చూడాలని తెలిపారు.

# బేస్ క్యాంప్ సిబ్బందిపై దాడి పైగా దొంగతనం కేసు మాత్రం బైండ్ వవర్...

కొండను తవ్వి ఎలుకను పట్టడం అంటే ఇదేనేమో..

స్మగ్లర్లే దొంగలు అధికారులపై దాడులు..

వారికి ఇచ్చిన శిక్ష మాత్రం బైండువర్..

ఇలా చేస్తే అక్రమ కలపను అధికారులు అడ్డుకోలేరన్న ఆరోపణలు..



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,జులై25(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలప స్మగ్లింగ్ కేరాఫ్ అడ్రస్ గా మారిన దేవునిగూడ గ్రామంలో కొంతమంది అక్రమ కలప రవాణా చేస్తూ అటవీశాఖ అధికారులకు చిక్కడంతో వారి దగ్గర నుండి అటవి శాఖ అధికారులు రెండు బైక్ లను స్వాధీనం చేసుకొని కవ్వాల్ అటవీశాఖ క్వటర్లలో భద్రపరిచారు.కలప దొంగలు అక్కడితో ఆగక అటవీ శాఖ సెక్షన్ అధికారి క్వాటర్ లో చొరబడి బేస్ క్యాంప్ సిబ్బందిపై దాడి చేసి వారు భద్రపరిచిన రెండు బైకులను దొంగతనంగా తెచ్చుకున్నారు.కలప అక్రమ రవాణాచేయడమే కాకుండా సిబ్బందిపై దాడి చేసి బైక్లను దొంగిలించిన ఐదుగురు దేవునిగూడ తండాకు చెందిన లాకావత్ ఉపేందర్,గవ్వల మురళీకృష్ణ, భూక్యసాయి,లాకావత్ విక్రం,లాకావత్ రాహుల్ పై పోలీసులు కేసు నమోదు చేసి స్థానిక తహసిల్దార్ బక్కయ్య ఎదుట హాజరు పరిచారు.ఒక్కొక్కరికి రెండు లక్షల చొప్పున బైండ్ వర్ పత్రం రాయించి వచ్చే ఆరు నెలల వరకు ఎలాంటి నేరాలకు పాల్పడబోమని హామీ తీసుకుని వ్యక్తిగత పూచికత్తుపై వారిని విడుదల చేశారు. ఇసుక రవాణాకు పాల్పడేటటువంటి వ్యక్తుల పైననే కేసులు నమోదు చేసి లక్షల రూపాయల రుసుము వసూలు చేసి వారిపై కేసులు పెట్టేటటువంటి అధికారులు అక్రమ కలపరవాణ చేయడమే కాకుండా అటవీ సంపదను దోచుకునీ అటవీశాఖ సిబ్బందిపై దాడి చేసి బైక్లను దొంగతనంగా తెచ్చుకున్నటువంటి వారికి నాన్ వెలబుల్ కేసు బనాయించకుండా..బైండ్ వర్ చేసి వదిలేయడంతో ఇలాంటి వారు మళ్లీ అక్రమ రవాణాకు పాల్పడే డేటటువంటి అవకాశాలు ఉండవా..అన్న ఆరోపణాలు వినిపిస్తున్నాయి.ఇంత విచిత్రం జరిగిన వీరిపై బైండోవర్ కేసు చేయడం అంటే అధికారులు కొండను తవ్వి ఎలుకను పట్టిన విధంగా కేసు ఉందని అటవీ ప్రేమికులు కొంతమంది ఆరోపిస్తున్నారు.

## పీవీ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

--విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆరోగ్య సేవలు




**మేడ్చల్,జూలై25(సూర్యరేఖ)**మల్లారెడ్డి హాస్పిటల్ వారి సౌజన్యంతో, లయన్స్ క్లబ్ సహకారంతో మేడ్చల్ పట్టణంలోని పీవీ పాఠశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో విద్యార్థులు,వారి తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహించి,అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించగలరని అన్నారు.సమాజ సేవలో భాగంగా మల్లారెడ్డి హాస్పిటల్,లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆరోగ్య శిబిరాలను తరచూ నిర్వహించి విద్యార్థులు ,తల్లిదండ్రులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.శిబిరంలో వైద్యులు విద్యార్థులకు ఆరోగ్య సూచనలు అందించడంతో పాటు,తల్లిదండ్రులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు నరసింహులుగౌడ్, ఆంజనేయులు,అకాడమిక్ ఇంచార్జ్ అనిత ప్రియా, లయన్స్ క్లబ్ సభ్యులు రవికుమార్,ఎస్ ఆర్ భాష,ఉపాధ్యాయులు,వైద్య బృందం,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆకతాయిల గుండెల్లో గబ్బర్ సింగ్..

దడ పుట్టిస్తున్న ఎస్సై ఉదయ్ కిరణ్

సంబంధం లేని ప్రదేశాలలో ఒకరికి మించి ఎక్కువ మంది కనబడితే కౌన్సిలింగ్





**జన్నారం,జులై25(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రోడ్లపై తిరిగేటటువంటి ,బైక్ రైడింగ్ రాత్రిపూట రోడ్లపై టైం పాస్ చేసేటటువంటి ఆకతాయిల గుండెల్లో దడ పుట్టిస్తున్నారు సంబంధం లేని ప్రదేశాలలో ఒకరికి మించి ఎక్కువ మంది కనబడితే కౌన్సిలింగ్ ఇస్తూ వారి ప్రవర్తనలో మార్పులు తీసుకొవస్తున్నారు.

అనడంలో సందేహం లేదు..

జన్నారం పోలీస్ స్టేషన్ లో ఉదయ్ కిరణ్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి జన్నారం మండలంలో ప్యాక్ ఆటజూదం,గంజా సేవికులకు త్రిబుల్ రైడర్,బైక్ రైడర్ల గుండెల్లో దడ పుట్టుకొస్తుంది. రాత్రింబవళ్ల తమ సిబ్బందితో కలిసి గస్తి నిర్వహిస్తుంటే పోలీస్ అధికారి అంటే ఇలా ఉండాలి అని పలువురు అభినందిస్తున్నారు.

## శ్రీతిరుమలగుట్ట వెంకటేశ్వర 22వ జాతర మహోత్సవం..



**నారాయణపేట,జులై25(సూర్యరేఖ)** నారాయణపేటలో తిరుమలగుట్ట శ్రీవెంకటేశ్వరస్వామి బ్రాహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు.స్వామివారి ఉత్సావ విగ్రహాలను వంశీయ అర్చకులు కుర్మాచలం వెంకటేశ్వర్లు ఇంటి నుంచి రథంపై ఊరేగింపుగా గుట్టకు తరలించారు. ఉదయం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలు మేళతాళతో బయలు దేరాయి.సాయంత్రానికి గుట్టకు చేరడంతో జాతర మొదటి రోజు వైభవంగా ప్రారంభంమైంది.తొలి ఏకాదశి రోజే స్వామివారిని ఘనంగా జెల్ది బిందే మహాభిశేఖం మంగళహారతి నైవేద్యం తీర్తప్రసాదం కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం నాల్గు గంటలకు పల్లకిసేవ మరియు రాత్రి భజన కార్యక్రమం నిర్వహించారు.ఆదివారం ఉదయం 11గంటలకు రెట్టపట్లు కార్యక్రమం జరుగుతుంది.1 మొదటి ముగ్గురుని ఓడించిన వారికీ 5తొలాల వెండి కడెం,రూ.2500 ఒక్క టెంకాయ శాల్వ,ఓడించిన వారికీ 10తోలలా వెండి కడెము రూ.5000,ఒక్క టెంకాయ,సంపూర్ణంగా ఓడించిన వారికీ 11తోలాల వెండి కడెము రు. 11.వేయిలు టెంకాయ శాలువ సమర్పిస్తారు.కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వెంకటేశ్వర్ల స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారిని కృపకు పత్రాలు కావలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జెట్టి అంజి,కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కతలప్ప,బిజెపి మాజీ కౌన్సిలర్ గొల్ల గోపాల్,అలాగే తాజా కౌన్సిలర్ రాము, గడ్డం వినోద్,జెట్టి బస్వరాజ్,ఆకుల వెంకటప్ప రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి..

విద్యార్థులకు నాణ్యమైన విద్య,పౌష్టికాహారం అందించాలి..

మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహశబరిష్

ఎస్ఐఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ,సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని తనిఖీ..





**మరిపెడ,జూలై25 (సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా,పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహశబరిష్ అధికారులను ఆదేశించారు.శనివారం మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించిన ఆమె డిజిటలైజేషన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ,స్వీకరణ తీరుపై బీఎల్‌వోలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను కచ్చితంగా సేకరించి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ ప్రక్రియలో బీఎల్‌వోలు, సూపర్వైజర్లు,అధికారులు,గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఆగస్టు 3లోపు ఫారాల సమర్పణ పూర్తిచేయాలని ఆదేశించారు.అనంతరం కలెక్టర్ నరసింహులపేట సాంఘిక సంక్షేమశాఖ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడి వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు,ఆహార నాణ్యత,డైట్ మెనూ అమలు గురించి ఆరా తీశారు.తరగతి గదులు,కిచెన్ షెడ్,డైనింగ్ హాల్,మరుగుదొడ్లు,పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం నిర్దేశించిన డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని,విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో నాణ్యమైన బోధనతో పాటు ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలను పెంపొందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ఉపాధ్యాయుల హాజరు శాతం కచ్చితంగా ఉండేలా చూడడంతో పాటు విద్యార్థినులకు విద్య, ఆరోగ్యం,పరిశుభ్రత,పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి,వైస్ చైర్ పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,తహశీల్దార్ కృష్ణవేణి,ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి,కమిషనర్ నరేష్ రెడ్డి,ఎంఈఓ గాదె అనితాదేవి,పాఠశాల ప్రిన్సిపాల్ ఆమెడ అరుణశ్రీ,ఆర్ఐ సాయివర్ధన్ రెడ్డి,కౌన్సిలర్లుగంట్ల గౌతం రెడ్డి,మెరుగు రాము, బోడ భాస్కర్,గుగులోత్ నీల లచ్చిరాం,పానుగోత్ రాములు, ప్రజాప్రతినిధులు, నాయకులు,అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆమడదూరంలో పారిశుద్ధ్య కార్మికులు..



కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలి..

వనంపల్లి జైపాల్ రెడ్డి



**రాజేంద్రనగర్,జులై25(సూర్యరేఖ)** పారిశుద్ధ్య కార్మికుల శ్రమతోనే పట్టణాలు పరిశుభ్రంగా,అభివృద్ధి చెందుతున్నప్పటికీ వారి సంక్షేమం మాత్రం నిర్లక్ష్యానికి గురవుతోందని తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి విమర్శించారు.తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్,కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభ రాజేంద్రనగర్ నవజ్యోతి యువజన సంఘ భవనంలో ఎం.మద్దిలేటి అధ్యక్షతన నిర్వహించారు.ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ...పారిశుద్ధ్య కార్మికులపై రోజురోజుకూ పనిభారం పెరుగుతోందని,వారి శ్రమతో హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నప్పటికీ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వాలు సరైన దృష్టి పెట్టడం లేదన్నారు.ప్రజారోగ్యం,పరిశుభ్రత,నగర సుందరీకరణ కోసం నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికులకు సఫాయి కర్మచారి కమిషన్ కూడా న్యాయం చేయడంలో విఫలమైందని,పర్యటనలకే పరిమితమవుతోందని విమర్శించారు.మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాన్ని రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.అంటువ్యాధుల మధ్య పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు,భూగర్భ మురుగునీటి కార్మికులకు నైపుణ్యం లేని కార్మికుల వేతనాలు చెల్లించడం అన్యాయమని పేర్కొన్నారు.మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేసి వారి పిల్లలకు ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.కొత్త వేతన సవరణలో మధ్యంతర భృతిని 30శాతం పెంచడంతోపాటు శాశ్వత కార్మికుల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మహాసభను అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ప్రారంభించి కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రామస్వామి,జిల్లా కార్యదర్శి చందు యాదవ్,బాలాపూర్ మండల నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,వి.లక్ష్మారెడ్డి,ఏ.రాజు,ఈ.సాయిలు, నరసింహతోపాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.అనంతరం తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సంఘం జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న వనంపల్లి జైపాల్ రెడ్డి రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం నూతన 26 మంది సభ్యులతో కూడిన కమిటీని ప్రకటించారు.జిల్లా అధ్యక్షుడిగా టీ.ఆనంద్,ప్రధాన కార్యదర్శిగా ఎం.మద్దిలేటి,కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పరమేష్‌ను ఎన్నుకోగా,ఇతర పదవులకు మరో ఎనిమిది మందిని నియమించారు.అలాగే 14 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

## లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డు అభివృద్ధి పనులపై సంఘం సమీక్ష



**రాజేంద్రనగర్,జులై25(సూర్యరేఖ)** లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డు అభివృద్ధి,సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.9.80కోట్ల వ్యయంతో చేపట్టిన భూగర్భ మురుగునీటి వ్యవస్థ,రోడ్ల నిర్మాణ పనులను శనివారం సంఘం ప్రతినిధులు అడికే రాజు బృందం పరిశీలించారు.ప్రజాప్రతినిధి సహకారంతో హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ ద్వారా మంజూరైన ఈ పనుల పురోగతిని ఉదయం 11.30గంటలకు ప్రత్యక్షంగా సమీక్షించారు.సంఘం అధ్యక్షుడు అడికే రాజు,ప్రధాన కార్యదర్శి పుల్లూరి హన్మండ్లు,పోకల వీరేష్,ప్రకాశ్ రావు,రాధాకృష్ణ తదితరులు పనుల ప్రదేశాన్ని సందర్శించి భూగర్భ మురుగునీటి పైప్‌లైన్ ఏర్పాటు,మన్‌హోల్స్ నిర్మాణం,సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా కాంట్రాక్టర్ సంతోష్ మాట్లాడుతూ ...భూగర్భ మురుగునీటి పైప్‌లైన్ ఏర్పాటు,మన్‌హోల్స్ నిర్మాణం పూర్తిదశకు చేరుకున్నాయని,సిమెంట్ కాంక్రీట్ రోడ్లకు సంబంధించిన పునాది పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు.సంఘం ప్రతినిధులు సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నాణ్యత, సమతుల్యత, దృఢత్వంతోపాటు వర్షపు నీరు నిల్వ ఉండకుండా తీసుకుంటున్న చర్యలను ప్రత్యేకంగా పరిశీలించారు.పనుల నిర్వహణలో సహకరిస్తున్న సంబంధిత అధికారులు,ఇంజినీరింగ్ విభాగం సిబ్బందికి సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ అభివృద్ధి పనులు లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డు నివాసులకు దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తాయని సంఘం పేర్కొంది.పనులు పూర్తయిన అనంతరం పరిశుభ్రత మెరుగుప డటంతోపాటు నీరు నిల్వ ఉండే సమస్య తగ్గి నివాస ప్రాంతంలో మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేసింది.అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా,నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసేలా సంబంధిత అధికారులు,ఇంజినీరింగ్ విభాగం నిరంతరం పర్యవేక్షించాలని లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డు అభివృద్ధి,సంక్షేమ సంఘం కోరింది.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఆర్థిక భరోసా..

కాంగ్రెస్ మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి



**మరిపెడ,జూలై25 (సూర్యరేఖ)** సీఎం రిలీఫ్ ఫండ్ పేద,నిరుపేద కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసాగా నిలుస్తోందని కాంగ్రెస్ మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి అన్నారు.శనివారం మరిపెడ మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.25 వేల విలువైన చెక్కును లబ్ధిదారురాలు రాధికకు రఘువీర్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు వరంగా మారిందన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని చెప్పారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చేయూత అందిస్తూ వారి కష్టకాలంలో అండగా నిలుస్తోందన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు,జిల్లా యువ నాయకుడు కుడితి నరసింహారెడ్డి,మరిపెడ మండల యూత్ అధ్యక్షుడు బానోత్ నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ ఘటనలో మరణించినవిద్యార్థుల శాంతికై ర్యాలీ..



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,జులై25(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా జన్నారం మండలంనీట్ పరీక్ష లీక్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుపడుతూ శాంతియుత ర్యాలీ నిర్వహించిన విద్యార్థితులపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో దాడులు జయించడంలో ఆ దాడిలో కొంతమంది విద్యార్థులు తమ ప్రాణాలు కోల్పోయారు. విద్యార్థుల ఆత్మశాంతి కోరుతూ జన్నారం మండల కేంద్రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నందునాయక్ మాట్లాడుతూ..చివరకు న్యాయమే గెలిచిందని, కాక్రోచ్ పార్టీ విద్యార్థి సంఘాలు కాంగ్రెస్ గెలుపు ఖాయం అయిందని,కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాతో కేంద్ర ప్రభుత్వం అవినీతి బయటపడిందని ఆయన అన్నారు.విద్యార్థులు తలుచుకుంటే అవినీతి అక్రమాలు చేపడుతున్న ప్రభుత్వాలే కూలిపోతాయనడానికి ఇదొక నిదర్శనంగా భావించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మేకల మాణిక్యం,పసివుల్లా,సయ్యద్ ఇసాక్,కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అజ్మత్ ఖాన్, ముజఫర్,రియాజుద్దీన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావుకు యాదాద్రి ప్రధాన అర్చకుల ఆశీర్వాదం..

మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనం... కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు



**యాదగిరిగుట్ట,జూలై25 (సూర్యరేఖ)**తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్ట యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు శ్రీలక్ష్మీ నరసింహాచార్యులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు నివాసానికి విచ్చేసి వేద మంత్రోచ్చా రణల మధ్య ప్రత్యేక ఆశీర్వాదం అందించారు.ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ నరసింహాచార్యులు తొలి ఏకాదశి పర్వదిన విశిష్టతను వివరించి,రాష్ట్రంలో సుఖశాంతులు, ప్రజల ఆయురారోగ్యాలు,అభివృద్ధి చేకూరాలని శ్రీలక్ష్మీనర సింహస్వామిని ప్రార్థిస్తూ రామచంద్రరావుకు ఆశీర్వచనం అందించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి స్వామివారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్,బీజేపీ సీనియర్ నాయకులు వేణుయాదవ్,గద్ద యుగేందర్తో పాటు పలువురు బీజేపీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణం లో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.

# ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు..

**ప్రజాగ్రహానికి ఎవరైనా తల వంచాల్సిందే..**
**బీఆర్ఎస్ కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు**
**ఎస్.వెంకటేష్**




**రాజేంద్రనగర్,జూలై25 (సూర్యరేఖ)** నీట్ ప్రశ్నా పత్రాల లీకేజి విషయంలో కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ వైఫల్యం స్పష్టంగా ఉందని బీఆర్ఎస్ కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు.కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో బాబుల్ రెడ్డినగర్ బస్తీలోని ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ...నీట్ ప్రశ్నా పత్రాల లీకేజి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు,యువకులు, విద్యావేత్తలు ఎంతగా కోరినా కేంద్రం పెడచెవిన పెట్టడం వల్ల పరిస్థితి చేయి దాటిందని పేర్కొన్నారు.వాంగ్ చుక్ దీక్ష విషయంలో విద్యార్థుల ఆందోళన విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఏమాత్రం సమంజసంగా లేదని వెల్లడించారు.విద్యార్థుల మీద అమానుషంగా ప్రవర్తించడం ప్రతీ భారతీయుడ్ని కదిలించిందని వివరించారు.ప్రజాగ్రహాన్ని గ్రహించే ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని తెలిపారు.అనేక మంది రైతులు మరణించిన తర్వాత సాగు చట్టాలను రద్దు చేసినట్లే,అనేక మంది విద్యార్థులు నష్టపోయిన తర్వాత ధర్మేంద్రతో రాజీనామా చేయించడం మోదీ చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లయిందని విమర్శించారు.నీట్ లాంటి జాతీయ పరీక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మరింత బాధ్యతగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో విద్యార్థుల గొంతును అణచివేయాలని చేసిన ప్రయత్నానికి ఈ పరిణామం మంచి సమాధానమన్నారు.విద్యార్థుల నిరసనలను అడ్డుకోవడం,ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం చివరకు ప్రభుత్వానికే నష్టాన్ని మిగిల్చిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే దేశ యువత తగిన సమాధానం చెబుతుందని..ఈ ఉద్యమ పోరాటం ఒక సందేశం ఇచ్చింది అని ఎస్.వెంకటేష్ అన్నారు.అనేక విషయాల్లో వైఫల్యం చెందిన రాష్ట్ర ప్రభుత్వం కూడా తాజా రాజకీయ పరిణామాలతో అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.ఎన్నికల సందర్భంగా విద్యార్థులు,నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎస్.వెంకటేష్ డిమాండ్ చేస్తూ,దేశంలో ఇక ముందు ఎలాంటి పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా లీక్ కాకుండా, అక్రమాలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవలసిందిగా పాలకులకు హితవుపలికారు.

# గగన్‌పహాడ్,కాటేదాన్,రాజేంద్రనగర్ రహదారులు నరకప్రాయంగా మారాయి..





**ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆపాలి-**
**బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు**
**సురెడ్డి వినయ్ రెడ్డి**


**రాజేంద్రనగర్,జులై25(సూర్యరేఖ)** గగన్‌పహాడ్,కాటేదాన్,రాజేంద్రనగర్ ప్రాంతాల ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారతీయ జనతా పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతిరోజూ వేలాది మంది వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు ,మహిళలు,వృద్ధులు ఈ రహదారులపై ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో రహదారి మధ్యలోనే విద్యుత్ స్తంభాలు ఉండడం అత్యంత ప్రమాదకరంగా మారిందని, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుం దోనన్న భయంతో ప్రజలు ప్రయాణిస్తున్నారని అన్నారు. ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని విమర్శించారు.గగన్‌పహాడ్ నుండి ఆరాంఘర్ వైపు నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ నెలకొంటోందని,గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు .రహదారుల దుస్థితి, అధిక రద్దీ కారణంగా ప్రమాదాల ముప్పు రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచింది. గగన్‌పహాడ్, కాటేదాన్,రాజేంద్రనగర్ ప్రధాన రహదారులను అత్యవసరంగా పునర్నిర్మించాలని, రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలను తక్షణమే పూడ్చి ప్రజలకు సురక్షితమైన రహదారులను అందుబాటులోకి తీసుకురావాలని కోరింది.అలాగే ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని డిమాండ్ చేసింది.ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం,గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ సంస్థ,విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే పరిష్కరించాలని,లేకపోతే ప్రజల తరపున భారతీయ జనతా పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి హెచ్చరించారు.

## బర్రె కొమ్ములతో పొడవడంతో వ్యక్తి మృతి

**రాజేంద్రనగర్,జులై25(సూర్యరేఖ)** బర్రె కొమ్ములతో పొడవడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్‌లో శనివారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ,బుద్వేల్‌కు చెందిన మల్లేపల్లి వెంకటేష్(42)బర్రెలను మేపుతూ,పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు.ప్రతిరోజు మాదిరిగానే శనివారం ఉదయం తనకు చెందిన ఏడు బర్రెలను మేపేందుకు బుద్వేల్‌లోని ధోబీఘాట్ వైపు తీసుకెళ్తుండగా,వెనుక నుంచి వచ్చిన ఓ బర్రె ఒక్కసారిగా వెంకటేష్‌పై దాడి చేసింది.బర్రె తన కొమ్ములతో వెంకటేష్ కడుపు,మోకాళ్లపై బలంగా పొడవడంతో ఆయన తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో పడిపోయాడు.ఇది గమనించిన స్థానికులు వెంటనే ఆయనను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.అయితే అప్పటికే వెంకటేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన బీజపా దేవర వంశీ బృందం..



**నాంపల్లి,హైదరాబాద్,జూలై25(సూర్యరేఖ)** సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి సమీపంలో కొత్తగా నిర్మించిన రైల్వేస్టేషన్ను ఈ నెల 26న(ఆది వారం)సాయంకాలం 3గంటలకు ప్రారంభం కానున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు దేవర వంశీ బృందంతో భోజన వ్యవస్థ ఇతరత్ర ఆతిధ్యం ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రముఖ పుణ్యక్షేత్రమైన సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి సమీపంలో కొత్తగా 6కోట్ల వ్యయంతో రైల్వేస్టేషన్ను కేంద్ర మంత్రులు జీ.కిషన్ రెడ్డి,బండి సంజయ్ కుమార్,ఈ స్టేషన్ను ప్రారంభిస్తారని దేవర వంశీ పేర్కొన్నారు. సికింద్రాబాద్ సిద్దిపేట మార్గంలో నడిచే డెమో రైళ్లు ఇకపై ఈ స్టేషన్లో ఆగుతాయని,భక్తులతో పాటు స్థానిక విద్యార్థులు,ఉద్యోగులకు ఈ రైలు సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

## బెల్లంపల్లి నియోజకవర్గ పెయింటర్స్ గౌరవ అధ్యక్షుడిగా ప్రభాకర్



**బెల్లంపల్లి,జులై25(సూర్యరేఖ)** బెల్లంపల్లి నియోజకవర్గ పెయింటర్స్ గౌరవ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా బెల్లంపల్లిలో నిర్వహించిన నియోజకవర్గ పెయింటర్స్ సమావేశంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.సమావేశంలో మాట్లాడిన ప్రభాకర్, పెయింటర్ల సమస్యల పరిష్కారం,హక్కుల పరిరక్షణ, సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.పెయింటర్స్ యూనియన్‌కు శాశ్వత స్థలం కేటాయింపునకు ఎమ్మెల్యేతో చర్చించి సాధించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న పెయింటర్లకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు,వారి వృత్తి అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు యూనియన్ తరపున చర్యలు తీసుకుంటామని తెలిపారు.పెయింటర్ల ఐక్యతే వారి బలమని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తే సమస్యల పరిష్కారం సులభమవుతుందని అన్నారు. పెయింటర్ల హక్కుల కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటూ, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.అనంతరం యూనియన్ సభ్యులు ప్రభాకర్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.సమావేశంలో నియోజకవర్గానికి చెందిన పెయింటర్స్ యూనియన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగష్టు 6న జరిగే బీసీ సాధికారత సదస్సును విజయవంతం చేయాలి..

**తెలంగాణ రక్షణ సేన నాయకుల పిలుపు**



**నారాయణపేట జిల్లా** కేంద్రంలోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆగష్టు 6న ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న బీసీ సాధికారత సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జి గవినోళ్ల శ్రీనివాస్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అదే విధంగా మక్తల్ నియోజకవర్గ టిఆర్ఎస్ ఇంచార్జి డి.కె.సి.హెచ్.వెంకటన్న మాట్లాడుతూ...జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ సోదర సోదరీమణులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.టిఆర్ఎస్ ప్రకటించిన “పంచ జన్యం”లో భాగంగా ఉచిత విద్య,ఉచిత వైద్యం,రైతే రాజు,ఉద్యోగాల కల్పన,ఉపాధి అవకాశాల విస్తరణ, మహిళా సాధికారతతో పాటు సామాజిక న్యాయం అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని”సామాజిక న్యాయ సాధన దినోత్సవం”గా నిర్వహించాలని టిఆర్ఎస్ అధినేత్రి కవిత అక్క నిర్ణయించిన నేపథ్యంలో, నారాయణపేట జిల్లా ప్రజలు,పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.జిల్లా మహిళా నాయకురాలు సంధ్యారాణి మాట్లాడుతూ...తెలంగాణలో సామాజిక న్యాయం సాధించాలంటే కవిత అక్క నాయకత్వమే సరైన దిశ అని అన్నారు. ఈ కార్యక్రమంలో దామర్‌గిద్ద మండల పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, టిఆర్ఎస్ నాయకులు డాక్టర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## విద్యావ్యవస్థలో సంస్కరణలు అవసరం

“ఒక దేశ నాశనానికి అణుబాంబులు కానీ, సుదూర క్షిపణులు కానీ అవసరం లేదు. విద్యా వ్యవస్థ ప్రమాణాలను తగ్గించి, విద్యార్థులను పరీక్షల్లో మోసం చేయడానికి అనుమతిస్తే చాలు.. ఆ దేశం తనంతట తానే కూలిపోతుంది.”దక్షిణాఫ్రికాలోని ఒక ప్రముఖ విశ్వవిద్యాలయ ప్రవేశ ద్వారం వద్ద పెద్ద అక్షరాలతో ఈ సత్యం రాసి ఉంటారు. సరిగ్గా ఈ కొటేషన్ మన దేశంలో నేడు చోటుచేసుకుంటున్న పరంపరలకు అద్దం పడుతోంది. దొరికినవాడే దొంగ.. దొరకనంత వరకు అందరూ దొరలే అన్నట్లుగా తయారైంది మన దేశంలోని పోటీ పరీక్షల తీరు. నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ ఉదంతం దేశవ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులలో, వారి తల్లిదండ్రులలో సృష్టించిన ఆగ్రహజ్వాలలు ఇంకా చల్లారలేదు. ప్రశ్నాపత్రం లీక్ అయిందని ఆధారాలతో సహా రుజువు కావడంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేసి, తీవ్ర నిరసనల మధ్య మళ్లీ నిర్వహించింది. అంతవరకు బాగానే ఉంది. కానీ, ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే ఈసారి దొరికింది కాబట్టి లీకేజీ బయటపడింది; మరి దొరకకుండా వెనుక తలకాయలు నడిపిన ముఠాలు, గతంలో జరిగిన పరీక్షల్లో ఎంతటి అక్రమాలకు పాల్పడి ఉంటాయి? భవిష్యత్తులో ఇవి మళ్లీ జరగవని గ్యారెంటీ ఏమిటి?మన విద్యా వ్యవస్థలో పేపర్ లీకేజీలు అనేవి ఒక సాధారణ రుగ్మత గా మారిపోవడం సమగ్ర ప్రజాస్వామ్యానికే పెను ప్రమాద ఘంటిక. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన అత్యున్నత వైద్య విద్యా ప్రవేశ పరీక్ష నీట్ లో చోటుచేసుకున్న అవకతవకలు బయటపడటంతో కేంద్ర ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. కేసు విచారణను సిబిఐ కి అప్పగించడం, దర్యాప్తు సంస్థలు బీహార్, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో నిందితులను అరెస్ట్ చేయడం, ముఠాల గుట్టు రట్టు చేయడం చరచరా జరిగాయి. హైటెక్ పద్ధతుల్లో వాట్సాప్ గ్రూపులు, సేఫ్ హౌస్‌లలో విద్యార్థులకు సమాధానాలు బట్టీ పట్టించడం వంటి ఘోరాలు వెలుగు చూశాయి. దేశంలో యువతరం రోడ్లపైకి వచ్చింది. లీకేజీల వ్యవస్థపై అసహనం శృతిమించి కాక్రోచ్ పేరుతో సరికొత్త నిరసన ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయి. లీకేజీలు, వ్యవస్థాగత లోపాల వల్ల తమ భవిష్యత్తు చీకటిమయమవుతోందన్న ఆవేదన, ఆగ్రహం యువతలో ఏ స్థాయిలో ఉందో ఈ నిరసనల ఉద్ధృతి స్పష్టం చేస్తోంది.మన దేశ పారదర్శకతకు పేపర్ లీకేజీలు కొత్తేమీ కావు. దశాబ్దాల చరిత్రను తిరగేస్తే, ప్రతిష్టాత్మక కేంద్ర, రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ఎన్నో సార్లు లీకేజీ ఘటనలు వెలుగు చూశాయి. బయటపడి, రగడ తీవ్రమైనప్పుడు మాత్రమే ప్రభుత్వాలు రద్దు నిర్ణయాలు తీసుకున్నాయి. సమాజం దృష్టికి రాని, ఆధారాలు దొరకని ఎన్నో సందర్భాల్లో అక్రమార్కులు అత్యున్నత ర్యాంకులు పొంది వ్యవస్థలోకి ప్రవేశించి ఉంటారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. దీనివల్ల రాత్రింబవళ్లు కష్టపడి చదివిన నిజమైన ప్రతిభావంతులు, నిరుపేద విద్యార్థులు శాశ్వతంగా తమ అవకాశాలను కోల్పోయారు. గతంలో జరిగిన నష్టాన్ని ఇప్పుడు పునరుద్ధరించలేకపోవచ్చు, కానీ భవిష్యత్తు తరాల భవితవ్యాన్ని రక్షించడానికి శాశ్వత, కఠిన కట్టడి చర్యలు వంద శాతం అవసరం. ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనాలు లేదా చిన్నచిన్న కమిటీలతో సరిపెడుతున్న పాలకులు, ఈ వ్యవస్థాగత చీడను తుడిచిపెట్టే శాశ్వత పరిష్కారాల వైపు అడుగులు వేయకపోవడమే అసలు విషాదం. పేపర్ లీకేజీల మహమ్మారి కేంద్ర పరిధిలోని పరీక్షలకే పరిమితం కాలేదు. తెలుగు రాష్ట్రాల్లో వైఫల్యాలు అనేకమంది అభ్యర్థుల జీవితాలను బుగ్గిపాలు చేశాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి ఎంసెట్ లీకేజీలు పదే పదే కలకలం రేపాయి. ముఖ్యంగా 2016 లో తెలంగాణలో జరిగిన ఎంసెట్-2 మెడికల్ పేపర్ లీకేజీ ఘటన దేశాన్నే గ్భ్రాంతికి గురిచేసింది. ఆల్ ఇండియా స్థాయిలో నెట్‌వర్క్ నడిపి, కోట్ల రూపాయలు వసూలు చేసి ప్రింటింగ్ ప్రెస్ స్థాయి నుంచే పేపర్ లీక్ చేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సి వచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలోనే కంప్యూటర్లు హ్యాక్ చేసి, అంతర్గత సిబ్బంది ద్వారా గ్రూప్-1 ప్రిలిమ్స్, అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షల పేపర్లు లీక్ కావడం అత్యంత భయంకరమైన ఉదంతం. ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో మగ్గిపోయిన నిరుద్యోగ యువత రోడ్లెక్కి ఉద్యమించాల్సి వచ్చింది. ఈ లీకేజీల ఫలితంగా పదే పదే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. తరచూ టెన్త్ క్లాస్ బోర్డు పరీక్షల ప్రశ్నాపత్రాలు పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షం కావడం, ఉపాధ్యాయులు, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రతినిధులు అరెస్ట్ కావడం మనం చూస్తూనే ఉన్నాం. మరోవైపు, ఒకే దేశం ? ఒకే పరీక్ష అనే అతిగా కేంద్రీకృతమైన నినాదం కూడా తీవ్రమైన సమస్యలను తెచ్చిపెడుతోంది. భారత్ లాంటి విభిన్నమైన, విశాలమైన దేశంలో కోట్లాది మందికి ఒకే ఏజెన్సీ ద్వారా ప్రవేశ పరీక్షలను నిర్వహించాలనుకోవడం పరిపాలనాపరంగా అత్యంత ప్రమాదకరమైన ప్రయోగం. దేశంలో ఎక్కడో ఒక మూలన ఉన్న పరీక్షా కేంద్రంలో చిన్న లోపం జరిగినా, లేదా ఒక డిజిటల్ నెట్‌వర్క్ హ్యాక్ అయి పేపర్ బయటకు వచ్చినా.. దేశవ్యాప్తంగా ఉన్న 20 నుండి 25 లక్షల మంది విద్యార్థుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. అంతేకాకుండా, రాష్ట్రాల విద్యా బోర్డుల స్వయంప్రతిపత్తి దెబ్బతిని, ప్రాంతీయ వ్యత్యాసాలు ఉన్న విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.ప్రజాస్వామ్యంలో నిరసన అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. అది ప్రభుత్వాల కళ్లు తెరిపించడానికి, వ్యవస్థాగత సంస్కరణలు సాధించడానికి ఉపయోగపడాలి. కానీ, ఆ నిరసనలు ప్రజా ఆస్తుల విధ్వంసానికి, హింసకు దారితీస్తే అది అరాచకత్వానికి దారితీసి, అసలు ఆశయానికే విఘాతం కలిగిస్తుంది.ప్రస్తుతం యువత జరుపుతున్న కాక్రోచ్ ఆందోళనలను , నీట్ నిరసనలను ప్రతిపక్షాలు ప్రత్యేకించి కాంగ్రెస్ వంటి పార్టీలు పూర్తిగా తమ రాజకీయ లబ్ధి కోసం హైజాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇది ఉద్యమ స్వభావాన్ని రాజకీయం గా మార్చేస్తోంది. గతంలో కాంగ్రెస్ సుదీర్ఘ పాలన కాలంలో ఏ రకమైన అవినీతి, వ్యూహాత్మక లోపాలు, ప్రశ్నాపత్రాల కుంభకోణాలు జరిగాయో దేశంలో మధ్య వయస్సులో ఉన్న ప్రతి పౌరుడికీ స్పష్టంగా తెలుసు. నాటి యూపీఏ హయాంలో వెలుగుచూసిన దారుణాలు దేశం ఇంకా మరచిపోలేదు.హింసకు, రాజకీయ హైజాకింగ్‌లకు తావివ్వకుండా, ప్రజాస్వామ్య గీత దాటకుండా సాగే వైజ్ఞానిక, చట్టబద్ధమైన పోరాటాలే ఎంతటి మొండి ప్రభుత్వాల మెడలనైనా వంచుతాయి. సమగ్రమైన, శాశ్వతమైన విద్యా సంస్కరణలకు తిరుగులేని బాటలు వేస్తాయి. రాజకీయనాయకుల స్వార్థానికి, అవినీతి ముఠాల అక్రమార్జనకు లక్షలాది మంది ప్రతిభావంతులైన విద్యార్థుల కన్నీళ్లు, నిరుద్యోగుల నిరాశ బలికాకూడదంటే ప్రతి ప్రశ్నా ప్రజాస్వామ్య ఆయుధంగా మారాలి.ప్రశ్నించే గొంతుకలకు స్పష్టమైన కార్యాచరణ తోడైనప్పుడే పాలకులు దిగివస్తారు. రాజకీయాల రంగు పడకుండా, చట్టసభలు చుట్టుముట్టేలా యువత తెచ్చే ఈ మేధో సంచలనమే రాబోయే రోజుల్లో వ్యవస్థలకు అసలైన దిశానిర్దేశం చేస్తుంది. పారదర్శకతకు పట్టంకడుతూ, పేపర్ లీకేజీలు లేని స్వచ్ఛమైన సమర్థ భారత్ ను నిర్మించుకోవడమే మన విద్యా వ్యవస్థకు, కష్టపడే ప్రతిభావంతులైన యువతకు మన సమాజం అందించే అత్యున్నతమైన, అసలైన గౌరవం!

## తొలి ఏకాదశి..భక్తి పారవశ్యం..

### టీఎన్‌జీఓఎస్ కాలనీ శ్రీవెంకన్నగుట్టపై బారులు తీరిన భక్తులు

### మార్మోగిన గోవింద నామస్మరణ..



**రాజేంద్రనగర్,జూలై25(సూర్యరేఖ)** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో దేవాలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి.మైలార్ దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురం టీఎన్‌జీఓఎస్ కాలనీలో వెలసిన శ్రీవెంకన్నగుట్ట శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం ప్రాంగణం కిక్కిరిసి పోయింది.అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిళ్లతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అభిషేకం,నిజపాద దర్శనం భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని,పవిత్ర నిజపాదాలను దర్శించుకున్న భక్తులు..విశేష భక్తి భావంతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆలయ పూజారులు మాట్లాడుతూ...తొలి ఏకాదశి రోజున శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనం,నిజపాద దర్శనం అత్యంత పుణ్యప్రదమని పేర్కొన్నారు.స్వామివారి దివ్య కృపాకటాక్షాలు సమస్త భక్తులపై సదా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ నెలకొనగా,దేవాలయం నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.దర్శనం అనంతరం భక్తులకు వివిధ రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు.ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా సాగిన తొలి ఏకాదశి వేడుకలు భక్తులకు భక్తి,ప్రశాంతతను పంచగా శ్రీ వెంకన్నగుట్ట ఆలయం మరోసారి పరిసర ప్రాంత భక్తుల విశ్వాసానికి నిలయంగా నిలిచింది. తొలి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.వందలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై యువజన కాంగ్రెస్ సంబరాలు




**మందమర్రి,జూలై25(సూర్యరేఖ)** నీట్ పరీక్షల వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని స్వాగతిస్తూ మందమర్రిలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం సంబరాలు నిర్వహించారు.పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించి ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ యువజన కాంగ్రెస్ నాయకుడు రాయబారపు కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల హక్కుల కోసం జరిగిన ఉద్యమానికి ఇది విజయంగా నిలిచిందన్నారు.విద్యార్థుల సమస్యలపై ఐక్యంగా పోరాడితే ఫలితం సాధించవచ్చని ఈ పరిణామం మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణకు తెలంగాణ యువజన కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.అలాగే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొని విద్యార్థులు,యువత హక్కుల కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు మహంత్ అర్జున్,మండల కార్యదర్శి బియ్యపు రవికిరణ్, మాజీ చెన్నూరు నియోజకవర్గం జనరల్ సెక్రటరీ వడ్లూరి సునీల్ కుమార్,మీడియా కమ్యూనికేషన్ ఇన్‌చార్జి చిప్పకుర్తి శశిధర్, పానుగంటి లక్ష్మణ్,తౌసిఫ్,సాత్విక్,ఒజ్జ గణేష్, సాయికిరణ్,ప్రదీప్,రేగుంట కిరణ్,మేర్గు సతీష్, రిత్విక్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు

## పెంట్‌హౌస్‌పై నుంచి దూకి యువకుడు ఆత్మహత్య..



**రాజేంద్రనగర్,జులై25(సూర్యరేఖ)**తాను నివాసం ఉంటున్న ఇంటి పెంట్‌హౌస్‌పై నుంచి దూకి ఓయువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నలందనగర్ కాలనీలో శనివారం చోటుచేసుకుంది.అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,మెహిదీపట్నంలోని ఎల్‌బీ డిగ్రీ కళాశాల అధినేత మధుసూదన్‌రావు కుటుంబం నలందనగర్ కాలనీలో నివాసం ఉంటోంది. ఆయన కుమారుడు నరైన్(29)కోళ్ల పెంపక వ్యాపారం నిర్వహిస్తున్నాడు.గత నెల రోజులుగా నరైన్ ముభావంగా ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు.శనివారం మధ్యాహ్నం తాము నివాసం ఉంటున్న ఇంటి పెంట్‌హౌస్‌పై నుంచి నరైన్ కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.మృతుడి తండ్రి మధుసూదన్‌రావు పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు తమ కుటుంబంలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

## ఎల్లోయి గ్రామంలో మిషన్ భగీరథ నూతన పైప్ లైన్ పనుల ప్రారంభం..

### ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందిస్తాం..

### సర్పంచ్ శివాజీరావు



**మనూర్,జులై26(సూర్యరేఖ)**ఎల్లోయి గ్రామంలో దశాబ్దాలుగా ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గ్రామ సర్పంచ్ శివాజీ రావు పాటిల్ చొరవ తీసుకున్నారు.శుక్రవారం గ్రామంలో మిషన్ భగీరథ నూతన పైప్ లైన్ నిర్మాణ పనులను సర్పంచ్ స్వయంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..."గ్రామంలోని ప్రతి ఇంటికి ఎటువంటి అంతరాయం లేకుండా మిషన్ భగీరథ తాగునీరు అందించడమే మా ప్రధాన లక్ష్యం..నీటి కొరత లేకుండా చూస్తామని ప్రజలకు హామీ ఇస్తున్నాను" అని అన్నారు.గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన సంకల్పమని సర్పంచ్ తెలిపారు.గ్రామంలో తాగునీరు,రోడ్లు,వీధి లైట్లు తదితర ఏ సమస్య ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకాన్ని సద్వినియోగం చేసుకుని,నాణ్యమైన పైప్ లైన్ల ద్వారా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు అధికారులు పాల్గొని పనులను పరిశీలించారు.

## నీట్ పేపర్ లీక్ చేసిన దుండగులను వెంటనే శిక్షించాలి..

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విట్టల్ రావు పటేల్



**నాగల్ గిద్ద,జులై26(సూర్యరేఖ)** నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తుంది.ఈ సంవత్సరం విద్యార్థులు ఎంతో నిరాశకు గురయ్యారు.విద్యార్థిని విద్యార్థులు రాత్రి పగలు అనకుండా ఎంతో కష్టపడి చదివి పరీక్ష రాస్తే, కొందరు దుండగులు పేపర్ లీక్ చేయడంతో వారి కలలు కల్లలయ్యాయి.దీనికి తోడుగా కొందరు కార్పొరేట్ సంస్థలు దీన్ని వ్యాపారంగా మార్చి ,పేపర్లను లక్షల్లో,కోట్లలో అమ్మి డబ్బులు సంపాదిస్తు న్నారు.వారికి తోడుగా కొందరు రాజకీయ నాయకులు సపోర్ట్ చేస్తున్నా రని ఆరోపించారు.విద్యార్థుల తరఫున మన నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే,ప్రియాంకగాంధీ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తే,బిజెపి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టి కాంగ్రెస్ పార్టీ నాయకులను అరెస్ట్ చేసి జైల్లో వేయడం జరిగింది.దీనిని తీవ్రంగా ఖండించారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినంత మాత్రాన సరిపోదని,పేపర్ లీక్ కు బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713